ఆంధ్రమహిళ



DECEMBER '58 ANDHRA MAHILA 37 NAYE PAISE

ఆంధ్ర మహిళా ప్రెస్సు

అందమైన అచ్చు పనులకు మారు పేరు

ఇంగ్లీషు, తెలుగు, తమిళం

అచ్చు పనులకు.

చక్కని ముద్రణ, కూర్పు.

సరసమైన ధరలు.

వివరాలకు:

మేనేజరు, 7. ఎ. రోజరీచర్చిరోడ్ మైలాపూరు మద్రాసు 4.



హైద్రాబాద్, తెలంగాణాలకు నవయుగ ఫిలిమ్స్. సికింద్రాబాద్.



ఆంధ్రమహిళ

సంపుటి 14 :: డిసెంబర్ '58 :: సంచిక 12

వ్యవస్థాపకురాలు
శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్
సంపాదకురాలు
శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్
ముద్రణ
ఆంధ్ర మహిళా ప్రెస్

విషయసూచిక

★✦★

ఆంధ్రమహిళ

సంపుటి 14 :: డిశంబరు '58 :: సంచిక 12

ఆవు - దూడ

ఆవుతోపాటు దూడయని కౌశికుడు చంద్రునితోపాటు లోహితాస్యునీ ఇంటికి తోడ్కొని పోయెను. అట్లే మహిళా సంక్షేమముతో పాటు శిశు సంక్షేమమునకు కృషి జరుగుచున్నదని తృప్తి పడటము కేవలము ఆశగానే ఇప్పటి వరకూ పరిణమించింది.

దేశమంతటా – మహిళలలో నవ చైతన్యమును గ్రామ గ్రామాల్లో మహిళోద్యమము కలిగించినదని చెప్పుకొనక తప్పదు.. కాని మహిళా సంక్షేమముతోపాటు శిశుసంక్షేమము ఎందుచేతనో జతగా నడవలేదు. మొదటి రెండు పంచవర్ష ప్రణాళికలలో మహిళోద్యమముతో పాటు శిశు సంక్షేమమునకు సమాన ప్రాముఖ్యమిచ్చినా శిశు సంక్షేమ కార్యక్రమాలు సరిగా రూపొందలేదు. అందుచేతనే 1952 లో భారతీయ శిశుసంక్షేమ సంఘమను జాతీయసంస్థ నొకటేర్పడి శిశు సంక్షేమమునకు ఇతోధిక సేవా సౌకర్యములు చేయుటకు పూనుకున్నది. దీని శాఖోపశాఖలే గాక అనేక స్వచ్ఛంద సంస్థలు తమకుచేతనైన విధమున ఇప్పుడిప్పుడే శిశు సంక్షేమకార్య క్రమాలందు పాల్గొనుచున్నవి. కాని వీరందరి కృషి తగినంత ఫలితము నివ్వలేక పోవుట విచారకరము. దేశములో ఈ శిశుసంక్షేమోద్యమునకు వలయు చైతన్యము బాలబాలికలందు, తలిదండ్రులందు, ఉపాధ్యాయ ఉపాధ్యాయినీ, సంఘ సేవకులందు కలిగించ వలసియున్నది.

కేవలము బాల సంఘాలు ఏర్పాటుచేసి బాల భవనములు కట్టుట వలన లాభములేదు. బాల సాహిత్యము. బాలలకు తగినచలన చిత్రములు ఎన్నోతయారు కావలయును. వారి విద్యకు వలయు అనేకరకముల పాఠశాలలు కావలయును. ఆధునిక శ్రవ్య, దృశ్య విధానాలద్వారా వుచితంగా పిల్లలకందరికీ ప్రాథమికవిద్యయినా ఇవ్వటముమనవిధి. వారి ఆరోగ్యము కాపాడుటకు తగిన వైద్యసౌకర్యాలు, తగిన ఆహారము సమకూరే ఏర్పాట్లు చేయవలసి యున్నది. బాలనేరస్థుల సంరక్షణ, అనాధ వికలాంగ బాలబాలికల సంరక్షణ సత్వరముగా మనము పూనుకొని మన చేతనైనంతవరకు సహాయము చేయుట మనవిధి. కృష్ణార్పణమంటూ ఇంకొక బిడ్డకిచ్చే, సహా

యము, చేయూతకు, తప్పకుండా భగవంతుడు మనబిడ్డకు చేస్తాడు. బిడ్డలకు (ఎవరి బిడ్డయినా) చేసిన సేవ వూరికేనేపోదు. అది పరబ్రహ్మ సేవయే.

మన దేశసారధి, అధినేత ప్రియనాయకుడైన నెహ్రూ పండితుని జన్మదినోత్సవము నాడు మనము బాల దినోత్సవము చేసికొనుట భావి పౌరుల అదృష్టము. వారును పండిత నెహ్రూ అడుగుజాడలయందే నడవగలరని ఆశించుదాము.

వారలా నడవటానికి సరైనమార్గము చూపెట్టడము మనవిధి. ఏది మరచినా మనము వారిపట్ల చేయదగు విధులను మరువజాలము కదా. ఏమరపాటు ఏమాత్రమైన కలిగితే మొన్నటి బాల దినోత్సవము నూతోన్నజము కలుగ చేసుండాలి.

ఆవుతోపాటు దూడ. మహిళా సంక్షేమోద్యమముతోపాటు శిశు సంక్షేమము జతగా చెట్టా పట్టా లేసుకుంటూ నడవాలి.

అంతే అంటారు కదూ సోదరీమణులు. ★

నేతా!

చెర్వు ఆంజనేయశాస్త్రి.


జయ విజయీభవ జవ్హారు నేతా!
జయ శాంతిశ్రీ దూతా! నేతా!

నవ్య భారత నందనోద్యాన
సుమమాలిక నీ శృంగారం
శ్రవ్య గీతికా సంగీతమ్ముల
చేకొను కర్పూర సౌగంధం—

ప్రాక్పశ్చిమల సౌభ్రాతృత్వం
ప్రభు! నీహృదయం నీసంకల్పం
ప్రపంచ జనతా భవ్య జీవులం
ప్రపంచ శాంతికి ప్రతిజ్ఞ చేస్తాం

ప్రణతులు మీకిస్తాం

జయ విజయీభవ!
జయ విజయీభవ!



రాజకీయాలు

అమెరికన్ ఎన్నికలలో పబ్లిక్ పార్టీ విపరీతం అయిన అపజయానికి గురి అయింది. ఈ పార్టీ తరఫున ప్రెసిడెంట్ ఐసెన్ హోవర్, కార్యదర్శి డల్లెస్ తీవ్రంగా కృషి చేశారు. అయినా ప్రజల తీర్పు వీరి కొన్ని విధానాలపట్ల అసమ్మతిని సూచించింది. ఈ ఎన్నికల ఫలితంగా పార్లమెంటు ఉభయ సభలలోనూ డెమోక్రటిక్ పార్టీ మునుపటికంటె ఎక్కువ స్థానాలను కైవశం చేసుకుంది. గత కొద్ది సంవత్సరాలుగా ప్రెసిడెంట్ ఐసెన్ హోవర్ వ్యక్తిగతంగా అపఖ్యాతికి గురి ఆయాడు. తన అంతరంగిక కార్యదర్శి షర్మన్ ఆడమ్స్ లంచాలు తింటున్నాడని లోకం కోడై కూసినా కూడా నమ్మక చివరివరకూ సమర్థిస్తూ వచ్చాడు. కాని చివరకు అతన్ని పంపక తప్పలేదు. ఇది ఒక కారణం. తరువాత దేశంలో ఆర్థిక మాంద్యం నానాటికీ తీవ్రరూపం దాల్చుతున్నా ఐసెన్ హోవర్ ప్రభుత్వం దాన్ని ఏమాత్రం అరికట్టలేకపోయింది. ఇక, విదేశాంగ విధానంలో డల్లెస్ చేతిలో కీలుబొమ్మగా వ్యవహరించడంతో ఉన్న గౌరవం కాస్తా తగ్గింది. ఈ మధ్య కాలంలో డల్లెస్ విదేశాంగ విధానంలో వేసిన తప్పటడుగులు వెనుకకు తీసుకోలేనివి. ఈవిధానం కారణంగా లెబనాన్ ఫార్మోజాలలో ఉపద్రవాలు లేచాయి.

మొండిపట్టుకి పేరుగాంచిన డల్లెస్ విదేశాంగ నీతికి బాహాటంగా అసమ్మతిని తెలియ చెప్పాయి అమెరికన్ ఎన్నికలు. అమెరికనులు శాంతి కాముకులని, ఉదార స్వభావులని, దూరదృష్టి, విజ్ఞాత కలవారని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. అంతర్జాతీయ రంగంలో ఉపద్రవాలకు దారితీయగల దురాగ్రహపరులకు విదేశ సహాయాన్ని వ్యతిరేకించే అభివృద్ధి నిరోధకులకు ప్రభుత్వంలో తావుండకూడదు. అందుకే ఇటువంటివారి స్థానే విదేశ వ్యవహార విషయాలలో సరస వైఖరిని ప్రదర్శించేవారిని, ఒడుగు దేశాలను ఉదారంగా ఆర్థిక సహాయం చేయాలనే అభిలాష కలవారిని అమెరికన్ ప్రజలు పార్లమెంటుకు హెచ్చుగా ఎన్నుకొన్నారు. కాంగ్రెసులో డెమొక్రటిక్ పార్టీ అత్యధికంగా మెజారిటీ సాధించింది. అతివాదులు దెబ్బతిన్నారు. దీనిఫలితంగా ఐసెన్ హోవర్ ప్రభుత్వం తన విధానాలను యుతోధికంగా మార్చుకోక తప్పదు. ప్రపంచ శాంతికి దోహకరం అయే విధానాలను అమెరికను ప్రభుత్వం యికమీదట నాంది పల్కగలదనడం సత్యదూరం కాజాలదు. ఈ విధంగా ప్రపంచంలో ఉద్రిక్తతను తగ్గించగలదని శాంతి కాముకులు ఆశింపవచ్చు.

◆ ◆ ◆

ప్రపంచం నలుమూలలా శాంతికోసం ప్రయత్నాలు జరుగుతూనేవున్నాయి. కాని అంతకంతగా అలజడులు తలెత్తుతున్నాయి. అర్జంటైనాలో అధ్యక్షునిపై కుట్ర జరిగినందువల్ల రాజధాని బోనోయిస్ ఎయిర్స్ అంతటా సైనిక కాపలా అమలులోకి తేబడింది. ప్రస్తుతం అధ్యక్షుడుగానున్న ఆర్టురో ఫ్రాన్డేజీని అధికారంనుంచి తొలగించడానికి ప్రయత్నం జరిగిందని ఉపాధ్యక్షుడు అలగ్జాండ్రో గోమెజ్ నేరారోపణ చేశాడు. ఆరోపణలను పరిశీలించడానికి గాను అర్జంటైనా ఉభయ సభలూ వెంటనే సమావేశం కావలసినదిగా ఆదేశింపబడింది. వ్యక్తుల పేర్లను

మినహా కుట్రకు సబంధించిన అన్నివిషయాలనీ ఉపాధ్యక్షుడు బైటపెట్టాడు.

ఈ విషయాలు వెల్లడి కావడమే తడవుగా అధ్యక్షుడు సైనిక మంత్రులతో సంప్రదించి వారి ప్రహకాన్ని సంపాదించాడు. మెండోజా రాష్ట్రంలో నూనె గనులలో పనిచేశేవారు. సమ్మె ప్రారంభించడానికి పురస్కరించుకొని అర్జంటైనా ప్రభుత్వం- ముప్ఫయి రోజులపాటు దేశం అంతా సైనిక ఆక్రమణ క్రింద వుంటుందని ప్రకటించిందని ఈ సందర్భంలో నాల్గు వందలమందిని ఎరస్టుచేయడంకూడా జరిగింది. యిది జరిగిన రెండు మూడు రోజులలోనే కుట్ర వార్తలు బయట పడ్డం అసలు అలజడి నిజానికి రాజకీయమైనది కాని కార్మిక సంబంధమైనవి కాదని తేలుతూంది. ఈ అలజడి రూపాంతరం ఎలా వుంటుందో వేచి చూడాలి.

యూరపు దేశాలలో పర్యటనకు బయలుదేరిన దేరిన జోర్డాన్ రాజు హుస్సేన్ విమానంపై ఆరబ్ రిపబ్లిక్ జెట్ విమానాలు కాల్పులు జరిపాయి, అందువల్ల తాను శతఘ్నుల మధ్యనుండి ఎలాగై తేనేం ప్రాణాలతో బయట పడ్డానని తిరిగి వచ్చి హుస్సేన్ తన ప్రజలకి చెప్పాడు.

♦ ♦ ♦

సిరియన్ భూభాగంమీదుగా విమానం వెడుతూ వుండగా యిది జరిగింది కనుక, యీ విషయమై జోర్డాన్ భద్రతా మండలికి ఫిర్యాదు చెయ్యకలదనీ, స్వయంగా సత్వర చర్యలు తీసుకోవలసిందిగా కోరగలదనీ జోర్డాన్ ప్రభుత్వం తెలియచేసింది.

మాస్కోలో ఉత్తమ స్థాయి నాయకులలో మార్పులు ఏక్షణంలో వస్తాయో ఎవరికీ తెలియదు.

ప్రభుత్వ వ్యతిరేకులైన వారిని నిర్మూలించడానికి గాను కృశ్చేవ్ ఏర్పాటు గావించిన ఒక విచారణలో సాక్షిగా నిలువడానికి అంగీకరించలేదని సోవియట్ మాజీ ప్రధాని మాలెంకోవ్ తుపాకీచే కాల్చి చంపి వేయబడ్డాడని అమెరికన్ పత్రిక ఒక వార్తను ప్రకటించింది. స్టాలిన్ తరువాత కొన్నాళ్ళు ప్రధానిగా పనిచేసిన మాలెంకోవ్ వార్తలు యీ మధ్య అసలు వినరావడంలేదు. సైబీరియాలో ఒక సిమ్మెంటు ఫాక్టరీకి యజమానిగా పనిచేస్తున్నదే మాలెంకోవ్ను గురించి విన్న చివరివార్త.

మాలెంకోవ్తో పాటు తనకి అడ్డంగావున్న మాలెటోవ్, ఝూకోవ్. కగనొవిచ్, సెపినోవ్. బుల్గానిన్ మొదలైన వారిని తొలగించే ఉద్దేశంతోనే కృశ్చేవ్ యీ విచారణ తతంగాన్ని ఏర్పాటు చేశాడని అమెరికన్ వర్గాలవారివూహ. ఇదంతా సత్యదూరంగా తోచదు. కాని, రష్యా అంటే యిదా అనిపించేలా ప్రవర్తిస్తున్న కమ్యూనిష్టు రాజకీయ నాయకులు, నిజంగా తమతమ దేశాలని ఏదారివెంట నడిపిస్తున్నారో? ఊహింపనైనా శక్యంకాని విషయంకదా !

పాకిస్తాన్లో వలెనే సూడాన్లో కెనడా సాయుధ దళాలు అధికారాన్ని చేజిక్కించు కొన్నాయి. రాజ్యాంగం తోసివేసి మంత్రాలను తొలగించి సేనలు అధికారానికి వచ్చాయి.

పాకిస్తాన్లో సైన్యాలు అధికారానికి వచ్చినప్పుడు ప్రెసింటుగా వున్న ఇస్కందర్ మీర్జాకు స్వస్తి చెప్పడం జరిగింది. పూర్తిగా అధికారులందరూ సైనికాధికారులే మొత్తానికి తురక దేశాలలో ప్రజాస్వామ్యానికి మనుగడ తక్కువేమో అనిపించడం సహజంగా తోస్తుంది.

ఒక్క మాట

గ్రామాలనుంచీ, పట్టణాలనుంచీ సోదరీమణులు ఆస్థి దాయాది హక్కుల బిల్లునుగురించిమీకు వ్రాస్తూవుంటారు. ఎవరి దాకావస్తేగాని వారికి తెలియదు ఏకష్టసుఖాలైన. మేము ఎన్నికల సమయములో స్త్రీ అభ్యర్థులను నిలిపి వారు జయించేటట్లు చూడమని అందుకే స్త్రీలను పదే పదే హెచ్చరించాము.

గతజల సేతుబంధమేల ఇప్పుడీమాట కేవలము మనలో మనమాటే సుమండి. పురుషుడు సాధారణంగా చాల స్వార్థంగలజీవి. కాబట్టి ప్రపంచములోవున్న సమస్తాన్ని తన సుఖము కోసము వినియోగించుకుంటాడు. మాతృమూర్తి అయిన స్త్రీ తన స్వార్థరాహిత్య జీవనముతో పురుషునికి మరింత ఎక్కువ అవకాశములు కలిగించుతూవుంది. తనకు మాలిన ధర్మము మొదలు చెడ్డ బేరమని తెలిసినా చేయునదిలేక స్త్రీ అసహాయురాలగుచున్నది. ఇప్పటికైనా తెలివి తెల్లారింది గనుక తరువాత కోరు స్త్రీలకైనా- అంటే మన బిడ్డలకైనా- సదవకాశాలు కలిగించే ప్రయత్నములో మనముండక తప్పదు. మనకీ బాధలు తప్పవు- క్రొత్తా పాతలమధ్య మనుష్యులము మనము కనుక క్రొత్తా పాతలమధ్య బాధ తప్పదు.

ఈ ఆస్థి దాయాది వగైరా బిల్లులు ప్యాసయినప్పుడే మేము యిక్కడ హెచ్చరించాము. ఇల్లు అలకంగానే పండుగ కాలేదని. అంతేకాదు. ఈ బిల్లులు పురుషులు కేవలము స్త్రీల కన్నీటి చుక్కలు తుడుచుటకు ప్యాసు చేయించినవేగాని నిజంగా స్త్రీలకు ఉపయోగపడేవికావని. ఆస్థి దాయాది బిల్లువలన వితంతువుకు ఉపయోగమైతే తల్లిగతేమిటి? కొందరికి లాభము కలిగితే దానివల్ల మరికొందరికి నష్టము కలిగితే ఎట్లాగు? భార్యకు, తల్లికి, అవివాహిత సోదర సోదరీమణులకు సమానముగా ఉపయోగపడవలయును కదా?

అంతేకాదు వివాహమైన వెంటనే భర్త ఆస్థిలో భార్యకు, భార్య ఆస్థిలో భర్తకు హక్కులు కలుగవలయునని మేము ఇదివరకే హెచ్చరించాము. ఇప్పుడు మళ్ళీ హెచ్చరించుచున్నాము. గ్రామ గ్రామములో ఏర్పడ్డ మహిళా సంఘాలు, ఈ విషయములు శ్రద్ధ తీసుకొని వారి ప్రతినిధులు తమ హక్కులు సంరక్షించేటట్లు చేసుకోవాలి.

— సంపాదకురాలు.

ఊయల నూచిన చేయే ఊళ్ళేలుతూంది !

ఇంజనీర్ అయిన మహిళ

ఎలిజబెత్ జాక్సన్ మెక్లీన్ రెండు ఉద్దేశాలతో 1951లో విస్కాన్సిన్ విశ్వవిద్యాలయాలో విద్యాభ్యాసం ప్రారంభించింది. ఆమెకు గణితశాస్త్రంపట్ల అధికాసక్తి ఉన్నది. అందుచేత తాను ఇంజనీరు కావచ్చునన్నది మెదటి ఉద్దేశ్యం, తనకు అన్నివిధాలా తగిన రంగం నగర ప్రణాళికా పథకం (సిటీ ప్లానింగ్) అవటంచేత, దానిలో ఉన్నత ఉద్యోగిగా రాణించవచ్చునన్నది రెండవది.

ఆమె అభిప్రాయం చాల సరైనదేనని తర్వాత బాగా రుజూవు అయినది. సివిల్ ఇంజనీరింగ్ లో ఆనర్సు డిగ్రీ పుచ్చుకొన్న వెంటనే, ఆమెకు షికాగో ప్లానింగ్ కమిషన్ లో ఉద్యోగం లభించింది. స్ట్రీట్ ట్రాఫిక్ అండ్ పార్కింగ్ బ్యూరోలో మూడవ ట్రాఫిక్ ఇంజనీరుగా ప్రస్తుతం ఆమె పనిచేస్తున్నది.

"ఇంజనీరింగ్ ఉద్యోగాల నిర్వహణలో స్త్రీ పురుషులమధ్య వ్యత్యాసం వుండటానికి ఏవిధమైన కారణం కనిపించదు. ఇంజనీర్లతో అవసరం ప్రతివారికీ ఉన్నది. ఈ రంగంలో మహిళలు పనిచెయ్యటంపట్ల నాతో ఎవ్వరూ తమ అసూయాభావం ప్రకటించలేదు" అని మెక్లీన్ అంటుంది.

అమెరికన్ నగర పునరుద్ధరణ కార్యక్రమంలో ఆమె గత రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నది. గృహనిర్మాణాభివృద్ధి, వెనుకబడిన ప్రాంతాలు పునరుద్ధరణ, పరిసర ప్రాంతాలను నివాసయోగ్యంగా చక్కచెయ్యటం మొదలైనవన్నీ నగర పునరుద్ధరణ (అర్బన్ రెన్యూయల్) క్రిందకు వస్తవి. వాటిలో మోటారుకార్లు, లారీలు, బస్సుల రాకపోకడల రహదార్ల విషయమై ఎన్నో సమస్యలు పొడచూపుతూ ఉంటవి.

ప్రతిరోజూ కొంతకాలం ట్రాఫిక్ బ్యూరోలోనూ మరికొంతకాలం ప్లానింగ్ శాఖలోనూ శ్రీమతి మెక్లీన్ పని చేస్తూ వుంటుంది. వీధులప్రక్కను కార్లు మొదలైన వాటిని నిలపటమూ, రాకడపోకడలగురించి పరిశీలనలు చేసి తన సిఫార్సులు ఆమె పంపుతూ వుంటుంది.

"పునరుద్ధరణకు పూర్వం ఒక్కొక్క ప్రదేశంలో కార్లు మొదలైనవాటికి ఎంతస్థలం ఉపయోగింపబడుతు ఉండేదో మేము పరిశీలిస్తాం. దానిని ప్రస్తుత అవసరంతో అంటే కార్లు ఎంతమందికిగలవో ఆ లెక్కలతో పోల్చి చూస్తాము. అటుపిమ్మట పునరుద్ధరణ ప్రణాళిక ననుసరించి ఆ ప్రదేశం అభివృద్ధి చేయటానికి తగిన ఉపాయాలు మేము తెలియపరుస్తూ వుంటాము" అని అంటుందామె.

ఆపని నిర్వర్తించేటందుకు, తన సహఉద్యోగితో శ్రీమతి మెక్లీన్ పునరుద్ధరణప్రాంతం సందర్శించి రాకడపోకడల ఉద్ధృతం, కార్ షెడ్లు, కార్లు నిలిపేటందుకు అనువైన ప్రదేశాలు ఎన్నివున్నవో పరిశీలిస్తుంది. నగరంలోని వెహికిల్ రిజిస్ట్రేషన్ శాఖనుంచీ, షికాగో ట్రాన్స్పోర్టేషన్ సర్వేశాఖనుంచీ ఎంతమంది కార్లు కలిగి ఉన్నారో తెలుసుకొంటుంది. అటుపిమ్మట ఆ ప్రాంతంలోని వీధుల పునరుద్ధరణ విషయమై చెయ్యవలసిన కార్యక్రమం తెలియచేస్తుంది.

"ఒకానొక ప్రాంతాన్ని పునరుద్ధరించవలసి వచ్చినప్పుడు అక్కడి వీధులలో రద్దీ ఎలావున్నదీ ముందు తెలుసుకో ప్రయత్నిస్తాము. ప్రదేశ వినియోగార్థ ప్రణాళిక అమలుపరచేటప్పుడు ఆ ప్రాంతంలోని వీధులగురించి బాగా ఆలోచిస్తాం. ఒక్కొక్కప్పుడు కొన్ని వీధులు రద్దుచేసి, మరికొన్ని సృష్టించవలసి వస్తుంది. ఇలాంటప్పుడే మా తెలివితేటలు, శక్తిసామర్థ్యాలు చూపవలసివస్తుంది" అని అంటుందామె.

రాకడ పోకడలు, బండ్లవల్లకలిగే రద్దీగురించి తన పరిశీలనలను పునరుద్ధరణ సంస్థలు అంటే గృహాలుకొన ఆస్థలాలను క్రొత్తక్రొత్త పనులనిమిత్తం వినియోగించే షికాగో ల్యాండ్ క్లియరెన్సు కమిషన్, పౌరుల వినియోగార్థం గృహాలు నిర్మించే షికాగో హౌసింగ్ అథారిటీ, పరిసర

ప్రాంతాలు అభివృద్ధి పరిచేటందుకు ఏర్పాటు చెయ్యబడిన కమ్యూనిటీ కన్సర్వేషన్ బోర్డు మొదలైన సంస్థలకు ఆమె పంపిస్తుంది.

తన సలహాలు కార్యాచరణలో పెట్టేటంత శక్తి ఉద్యోగరీత్యా ఆమెకు లేకపోయినప్పటికీ నగర ప్రణాళికా శాఖవారు తన సలహాలు సాధారణంగా పాటిస్తూ ఉంటారని మెక్లీన్ తెలియచేస్తుంది.

అమెరికా మహానగరాలలో షికాగో రెండవది. తదితర అమెరికన్ పురపాలక సంఘాలవలె అదికూడా అతి వేగంగా అభివృద్ధి చెందుతున్నది. అయినప్పటికీ, రాకడ పోకడలు. వీధులప్రక్కను కార్లు నిలిపే స్థలాలగురించి తలఎత్తే సమస్యలు పరిష్కారం చెయ్యవచ్చునని శ్రీమతి మెక్లీన్ తన ఆశాభావం వ్యక్తం చేసింది. "భూగర్భంలో కార్లషెడ్లు నిర్మించడం, రాకడకుగాని లేదా పోకడకు గానీ అంటే దేనికో ఒకదానికి మాత్రమే కొన్ని వీధులు ఉపయోగించాలన్న నిబంధనలను ప్రవేశపెట్టటం మూలంగా కార్ల పెరుగుదలకు తట్టుకోకలుగుతున్నాం. షికాగో నగరం 20 ఏళ్ళకు పూర్వం ఉన్నంత ఇరుకుగా ప్రస్తుతం లేదని నా అభిప్రాయం. నగరాన్నంతటినీ ఒక్క క్షణంలో పునరుద్ధరించలేము అన్న యథార్థం ఆధారం చేసుకొని, ఎక్స్‌ప్రెస్ రహదార్లు ఏర్పాటుచేసి వేగంగా నడిచే కార్లు మొదలైనవాటి రద్దీ తగ్గిస్తున్నాం" అని ఆ మహిళా ఇంజనీరు తెలియజేసింది.

ఇంజనీరు కావాలన్న తన మనోవాంఛ నెరవేరినందుకు ఆమె ఎంతో సంతోషపడుతుంది. తాను "మహత్తరమైనదని ఎంచే ఉద్యోగాన్ని ఆమె నిర్వహిస్తుంది. ఇంజనీరింగు వృత్తిగాగల నాలుగు సంస్థలలోనూ ఆమెకు సభ్యత్వం వుండటమేకాక, వాటితో ఎక్కువ సంబంధ బాంధవ్యాలు ఆమె కలిగిఉన్నది. పురుషులకోసం ప్రత్యేకంగా స్థాపింపబడిన ఇంజనీరింగ్ సంస్థలోకూడా ఆమె గౌరవ సభ్యత్వం కలిగిఉన్నది. భర్త ఛార్లెస్ మెక్లీన్ కూడా ఇంజనీరుగా పనిచేస్తున్నారు. ఆ దంపతులు ఇద్దరూ ఇంజనీర్లు అయినందున పరస్పరం కలసి మెలసి పని చెయ్యటానికి ఎంతో అవకాశం లభించింది.

ఎవరు నువ్వు?

శ్రీ ఆచంట జానకిరామ్

ఏ మాటలాడినా నీ మాటలే!

ఏమి ఆలోచించినా నీ ఆలోచనే!

ఏమి చేయబూనినా నీకోసమే!!

ఎవరు నువ్వు!

ఉదయిస్తూన్న సూర్యుణ్ణి చూస్తూంటే నీవే జ్ఞాపకము వస్తావు! సంధ్యవేళ ఆకాశాన్ని ఆవరించిన వెండి, బంగరు కాంతులలో నీ అందమే కనిపిస్తుంది నాకు.

తళుక్కు తళుక్కుమనే ఆ మొదటి నక్షత్రము నీకళ్ళ ధగధగనే అనుకరిస్తుంది, నాఊహాలో.

నీలి ఆకాశంలో తేలిపోతూన్న చంద్రబింబపు చల్లదనము నీ చల్లదనపు ప్రతిబింబమే అను కుంటాను నేను. నీ దగ్గర అరువు తెచ్చుకున్నదే, చంద్రుని ఆ సౌమ్యత!

ఎవరు నువ్వు!

లేచీ లేవడముతోనే, నీ కొరకు పువ్వులు సేకరించడానికి తోటలోకి వెళ్ళగానే విరగ పూసిన పారిజాతము విరుల నన్నిటినీ జలజలా రాలుస్తుంది, పుష్పవర్షంగా, నన్ను చూడగానే- నిన్ను తలచుకొని.

మధుర వచనాలతో, మల్లె అంటుంది:

“నిన్నటి పువ్వులు సరిపోయాయా, ఆమె తలలోకి? ఈవాళ మరిన్ని పువ్వులిస్తాను.”అని.

త్రోవకు అడ్డముగా నిలచి సంపెంగ అంటుంది: సంపెంగలంటే ప్రాణము ఆమెకు. ఈరోజు పాతిక పువ్వులు పూశాను; పాతిక పువ్వులూ చెంపుకట్టి ఆమె తలలో ఉంచు; మరే పువ్వులు వద్దు!: అని.

ఉన్నట్టుండి, తోట అంతా మొగలిపువ్వు సువాసనే!! అట్టహాసంతో అంటోంది కేతకి: “మరే పువ్వులూ వద్దట! కాస్త చనువిస్తేచాలు నెత్తి కెక్కుతారు కొందరు! అంత అహంభావము కూడదు. అసలు, ఆమె కాంతే మొగలిపువ్వు కాంతి; ఆమె రూపమే మొగలిపువ్వు రూపము; ఆమె లావణ్యమే మొగలిపువ్వు లావణ్యము!” అని.

ఎవరు నువ్వు!

కొలనులో జలకమాడుతూంటే వికసించిన తామరపువ్వు వయ్యారంగా నా వైపు వ్రాలి రహస్యంగా నా చెవిలో అంటుంది:

“నిజంచెప్పు, నాకంటే ఆమె ముఖమే అందముగా ఉంటుందికాదూ... కాదూ? నీ మనస్సులోని మాటచెప్పు- నేను ఏమీ అనుకోనులే” అని.

ఎవరు నువ్వు!

కుంచె తీసుకుని, రంగులు కలుపుకొని చిత్రఫలకము మీద నీ రూపము చిత్రింపబోతే, ఎంత ప్రయత్నించినా కుదరదు: నా హృదయంలోని బొమ్మకు సాటైన బొమ్మ.

కాని, చూడవచ్చిన వారందరూ అంటారు:

పారిజాతపు ప్రసన్నత; తామర రేకులవంటి కన్నులు; సంపెంగ వంటి నాసిక; ఎర్రి గులాబీ వంటి పెదవులు; మొగలిపువ్వు వంటి బంగారపు దేహకాంతి; మల్లెల వంటి చిరునవ్వు- కళ్లలో నక్షత్రాల ధగ ధగ- వెన్నెలలు వెదజల్లే ఈ అప్సరస ఎవరు?” అని.

ఎవరు నువ్వు! ఎవరు నువ్వు!!

విజయుడు

నాటిక

శ్రీమతి కె. ఆర్. లక్ష్మి

(విజయ, ఇద్దరు, ముగ్గురు స్నేహితులు; నిర్మానుష్యంగా వున్న రోడ్డుమీద- వేళాకోళాలు చేసుకుంటూ నడుస్తూంటారు.)

విజయ : ఏం చంద్రశేఖరా, యిలాంటి నిర్మానుష్యంగా వున్న దారి పట్టించావు?

చంద్ర : అలా అనకు రాకుమారా. యీ వీధి సోయగం యింకో అర నిముషంలో నువ్వే తెల్సుకుంటావు.

విజయ : ఏమో, నీ ఉద్దేశ్యాలేవిటో బోధ పడ్డంలేదు. హాయిగా మనం రోజూ పోయే చెరువు గట్టుకి పోవలసింది.

రె. స్నే : పోయి?

వి : ఏముందీ, సుందారాంగులని తిలకిస్తూ వారి వారిజ పూరిత ఘటాలను వుండేలుతో పగులవేస్తూ.... వారి భయ కంపిత తనూలతల వన్నెలు తిలకిస్తూ....

చం : ఆగు ఆగు. రాకుమారా, అంతకంటె ఎక్కువ ఆనందాన్నే యింకో కొద్ది క్షణాలలో పొంద కల్గుతావు. ఈ రాస్తా మహత్యం నీకే తెలుస్తుంది!

రె. స్నే : నీకు అర్థం అవదు చంద్రశేఖరా, రాకుమారుని ఆందోళన- ఆనాడు చూసిన సింహేంద్రమధ్యను యీనాడూ దర్శింప లేకపోయానే అని....

చం : ఖంగారు పడకోయి సోదరా విజయ రాకుమారుని కన్నుల కీనాడు పండుగే జరుగుతుంది. దాంతో పాటు మనకీననుకో....

విజ : ఎమిటో నాకేం నచ్చలేదోయి చంద్రశేఖరా.... ఈ సుందర సాయంసమయాన్నంతా వృధా చేశాం....

[ఎడం పక్క నుంచి అందమయిన అమ్మాయీ చెలికత్తె నడిచి వస్తూంటారు చెలికత్తె చేతుల్లో పూల పళ్లెం వుంటుంది. అమ్మాయి తామర పూవు వయ్యారంగా చేత వూపుతూ ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ నడుస్తూంటుంది, హఠాత్తుగా దూరంగా కన్పించిన యీ కొత్త వ్యక్తులని చూసి చెలికత్తె చేయి తన చేత తీసుకుంటుంది. స్టేజికి అటు చివర నున్న విజయ బృందం అందులో ముఖ్యంగా విజయ కన్నార్పకుండా అమ్మాయి కేసి చూస్తూ వుండి పోతాడు.)

చం : (హేళనగా) విజయా, రాకుమారా, ఏదీ నీ వుండేలు బద్ద?

విజయ : (నవ్వుతూ, చేయిజారి కింద పడిన ఉండేలు వంగి తీసుకుంటాడు)

రె. స్నే : చూడు విజయా ఆసోయగం.

విజ : ఉండండి. మీరుట్టినే గొడవ చేస్తే.... (ముందుకు నడుస్తాడు)

(అమ్మాయినీ చెలికత్తెనీ సమీపించుతాడు,)

విజ : రాకుమారీ.

చెలి : రాకుమారి కాదు; వంగ రాజ సేనాపతి ఏకైక పుత్రి మాధవి.

విజ : సంతోషము చెలీ, మీ యజమాని పరులతో మాట్లాడదా? (నవ్వుతూ)

చెలి : ఆమె కవసరం ఏముంది అడ్డమైన వాళ్ళతో మాట్లాడ్డానికి?

విజ : పొరపడుతున్నావు. నే వంగ రాజ పుత్రుణ్ణి విజయుణ్ణి, యీ సంగతి మీ యజమానికి తెలియదేమో!

చె : (ఆశ్చర్యంగా ముఖం పెట్టి) రాకుమారా, నేనూ, మా చెలీ దేవీ పూజ చేసి యిటు పోవుచున్నాం.

మమ్మల్ని అడ్డగించడం భావ్యంకాదు. మమ్మల్ని వెళ్ళనీయండి.

(విజయ స్నేహితులకి చేయి సౌంజ్ఞ చేస్తాడు వారు సమీపిస్తారు.)

వి : రాకుమారీ .... పొరపాటు, సేనాధిపతి పుత్రీ మాధవీ— యీ విజయుణ్ణి కనికరించు. కన్నెత్తి చూడు. మదన చాపంలా మెరిసే నీతనూలత యీ విజయుణ్ణి ఉన్మత్తుణ్ణి చేసిందంటే నమ్ము.

మా : అధిక ప్రసంగం చాలించి దారి విడవండి. అది మర్యాదస్తుల లక్షణం.

వి : అవును. హృదయం విప్పి కోర్కె తెలియ చేసిన దీనుణ్ణి కరుణించడం కూడా సహృదయుల లక్షణమే. మన్మథ బాణం లాంటి ఆ తామర మొగ్గ నాకిచ్చి వెళ్ళు. (చేయిచాచి తామర నందుకో బోతాడు.)

మా : (అదరి పడి) ఆగు. ఏమిటా పొగరు? రాకుమారుడి వయిన మాత్రాన యింతటి దౌర్జన్యమా? రేపేపాటికి చూడు నిన్నేం చేస్తానో. (ఒణికి పోయి చెలికత్తె బుజంమీద ఆనుకుంటుంది.)

వి : ఏం చేస్తావు? కోమలాంగీ! ఏం చెయ్యకలవు సుందరీ! రాకుమారుడు యీ విజయుడు తల్చు కొంటే!

చం : అవును రాకుమారా, నీకు ఎదురు తిరిగిన యీ చిరుత ఏం చెయ్యకలదు?

మా : అలాగే, చూడు, నిన్ను నీ అనుచరులనీ కూడా యీ దేశంలో వుండ కుండా చేస్తాను. కన్యల మీద దౌర్జన్యం చేయ బూనే నువ్వు సింహబాహు రాజ్యంలో ఉండడం ఆ రాజ్యానికే అవమానకరం. సిగ్గుచేటు.

వి : (కోపంగా) మాటలు మీరకు మాధవీ, రేపీపాటికి నన్ను సింహబాహు రాజ్యంలో ఉండనియ్యా నంటున్నావు. కాని నువ్వు నా బాహు వల్లరిలో వుండే టట్లు చేస్తాను. అప్పుడు తెలుస్తుంది విజయుని ప్రభావం. ప్రస్తుతానికీ పూవు చాలులే— (అంటూ ఆమె చేతిలోని తామర మొగ్గ లాక్కుంటాడు. రాకుమారి నిశ్చేష్ట అయి నిల్చుండి పోతుంది. విజయుడు హేళనగా నవ్వుకుంటూ, స్నేహితులతో వెళ్ళిపోతాడు) (తెర)

రెండవ దృశ్యం

(రాజుగారి ఆలోచనా మందిరం, వృద్ధ సేనానీ, రాజూ తీవ్రంగా ఆలోచిస్తూ వుంటారు. రాజు అశాంతితో యిటూ అటూ పచారు చేస్తూంటాడు.)

రాజు : ఏం చేయమంటావు సేనానీ, నీ కూతురి మీదనే విజయుడింతటి దౌర్జన్యం చేస్తాడని నేననుకోలేదు. వీడు నా కడుపున చెడపుట్టాడు. సింహబాహు వంశానికే వీడు కళంకం.

మంత్రి : ఆలా అనకండి ప్రభూ! విజయుడు ఏదో కుర్రవాడు! కుర్రతనం చేష్టలనుండి మనం మళ్ళించాలే గాని దాని కతన్ని మనం ఏ రీతినా శిక్షించ కూడదు.

రా : అలా అనకు మంత్రీ. ఈ రోజు నీ కుమార్తెని అడ్డగించాడు. ఇలా అసలెంద రమాయిక యువతులని దారి కడ్డు కాసి అవమానిస్తున్నాడో! ఏమైనా సరే, విజయుణ్ణి నేను క్షమించను. క్షమించడం అంటే, రాజ్య ధర్మాలనే విస్మరించడం— ఈ సందర్భంలో. మహా మంత్రీ, వెనుకాడకండి, విజయుణ్ణీ, అనుచరులనీ ఇక్కడికి రమ్మనండి. ఏం సంజాయిషీ చెప్పుకుంటాడో చూసి. తరువాత నా ఆజ్ఞను తెలియ పరుస్తాను.

(మహామంత్రి ఎడం పక్కకు వెళ్లి— "ఎవర క్కడా;" అంటాడు. "ఏం అనుజ్ఞ ప్రభూ" అంటూ సేవకుడు- లోపల నుంచే అంటాడు. "రాకుమారుడినీ, అతని అనుచరులనీ తక్షణం యిక్కడికి రమ్మను. రాజాజ్ఞగా సెలవియ్యి.")

రా : రాజ్యం వినాశన మయే రోజులు దగ్గిరకు వచ్చినట్లే వున్నాయి— యీ విపరీతాలని చూస్తూంటే. ఎంత దారుణం! సింహబాహు పుత్రుడయి వుండీ, ఎంత నీచంగా ప్రవర్తిస్తున్నాడు! మహా మంత్రీ, నేను ఒక నిశ్చయానికి వచ్చేశాను. విజయుణ్ణీ, అనుచరులనీ, దేశం నుండి వెడలి పోవాలని ఆజ్ఞ వేస్తాను. విజయుడు యీ రాజ్యంలో నిలువ అనర్హుడు. (ఆవేశంతో అనేస్తాడు) (విచారంగా) అల్లారు ముద్దుగా పెంచి పెద్దవాణ్ణి చేశాను. తిరిగి నాలా రాజ్యాధిపత్యాన్ని వహిస్తాడనుకున్నాను.... కాని....

మం : అలా అనకండి ప్రభూ, విజయుడు చిన్నవాడు....

(ఇంతట్లో విజయుడు, అనుచరులూ ప్రవేశిస్తారు.)

వి : తండ్రిగారికి నమస్కారం. మహా మంత్రీ నమస్కృతులు. తండ్రీ, ఏం పిలిపించారట?

రా : అవును పిలిచాను. మంత్రీ ఎందుకు పిలిపించిచాం యువరాజుని?

మం : (విజయుని కేసి తిరిగి) రాకుమారా, ప్రశాంతంగా నిర్మానుష్యంగా వున్న దారులవెంట వనితలు పోతూంటే దారికాసి, వారినవమానించారని నీమీదా, నీ స్నేహితులమీదా, ఒక మానిని ఫిర్యాదుచేసింది. నీవేమి సంజాయిషీ చెప్పుకుంటావోనని రాజుగారు పిలిచారు.

(విజయుడు స్నేహితుల ముఖాల కేసి చూస్తాడు. స్నేహితుడు విజయుడికి సౌంజ్ఞ చేస్తాడు ఉండేలు దాచమని. విజయుడు వృధా ప్రయత్నం చేస్తాడు దాన్ని వెనకాల వుంచడానికి. ఇదంతా చూస్తూన్న మహారాజు.)

రా : అదే కాబోలు నీ గాండీవం యువరాజా!

(విజయుడు తల వంచేస్తాడు.)

రా : నీ సంజాయిషీ కూడా నాకనవసరం. ఈ రోజే సూర్యాస్తమయంలోపున యీ దేశంలో వదలి నీవూ ని అనుచరులూ వెళ్ళిపోండి. యిది రాజాజ్ఞ. యిక మీరు వెళ్ళవచ్చు. మంత్రీ, మిగతా విషయాలు తరువాత చర్చించుకుందాం. నన్ను కాస్సేపు ఏకాంతంగా వదలండి.

(మంత్రి వెళ్ళిపోతాడు. వారి వెనుకనే విజయుడూ, స్నేహితులూ వెళ్లిపోతారు. రాజు మాత్రం విషాదంగా నిల్చుని వుండగా తెర పడుతుంది.)

మూడవ దృశ్యం.

(తమతమ ఆయుధాలతోనూ, సాధారణ దుస్తులతోనూ విజయుడూ స్నేహితులూ ప్రవేశిస్తారు. అందరి ముఖాలూ అలసినట్టు వుంటాయి.)

వి : ఎన్నాళ్ళిలా నడవడం చంద్రశేఖరా. ఎక్కడికీ అంతులేని ప్రయాణం?

చం : అలా నిస్పృహ చెందకు రాకుమారా, కొద్ది గంటలలోనే మనం యింకో దేశంలో అడుగెట్టేలా వున్నాం.

స్నే : ఒ : అదేం దేశమో ఏమిటో ! అక్కడికి మనల్ని అసలు రానిస్తారా?

చం : అధైర్యం పురుష లక్షణం కాదు. అందులోనూ మనం క్షత్రియులమయి వుండీ యిలా బెంబేలు పడి పోవడం ఏమిటి? దూరంగా అదుగో చూడు పచ్చని చెట్లూ మనుష్యుల అలికిడీ కనిపించడంలేదూ? వినిపించడంలేదూ?

వి : ఏమో చంద్రశేఖరా, నాన్నగారింతటి దారుణమైన ఆజ్ఞ వేస్తారనికోలేదు. అయినా, ఆ మాధవి కోడెతాచు! ఎంత పని చేసిందో చూడు!

చం : చెప్పే చేసింది కదా, రాకుమారా, దానికి మనం చింతించి ఏం లాభం? ముందు ఆలోచన చెయ్యాలి. యీ రాత్రికి ప్రయాణం సాగింప కలిగామంటే ఉదయానికి మనం హాయిగా ఉంటామనే తోస్తూంది నాకు.

వి : ఏమో, నాకు మటుకు అలసట ముంచుకు వస్తూంది....

(తెర)

నాల్గవ దృశ్యం

(తెర ఎత్తగానే, దిగిన పక్క నుంచి కాకుండా రెండో పక్కన ఒక మూలగా విజయ, స్నేహితులు నలుదిక్కులా చూస్తూవుంటారు. స్టేజికి యివతల చివరకు కువేణీ యిద్దరు చెలికత్తెలూ వయ్యారంగా కూర్చుని వుంటారు. చెలికత్తెలు కువేణిని వేళాకోళాలు చేస్తూ పూలతో అలంకరిస్తూ వుంటారు.)

కువేణి : అబ్బా, ఏమిటేమీమోటు తనం, చూడు నా బుగ్గలెలా కందిపోయాయో.

చె : అంత సుకుమారివైతే ఎలాగ తల్లీ. పుట్టిన వంశం ఏమిటి? యింత నాజూకు ఏమిటి? ఎవరేనా వింటే నవ్వి పోతారు!

కు : ఎందుకే నవ్వడం? రాక్షస వంశంలో పుట్టితే మటుకు స్త్రీలకి నాజూకు వుండదా యేమి?

రె. చె : బాగా చెప్పావు రాకుమారీ, ఏ వంశపు రాకుమారీలకీ నువ్వు తీసి పోవు.

కు : పొండే, అసలు మీతో మాట్లాడను.

(ఇంతట్లో దూరంగా స్టేజికి యింకో ప్రక్క నుంచి ప్రవేశిస్తూన్న విజయుని అనుచరులని ఒక చెలికత్తె చూస్తుంది. రెండో చెలికత్తెని అటు తీసుకు వెళ్ళి చూపుతుంది. ఇద్దరూ కలిసి కువేణి చెంతకుకు వస్తారు.)

కు : ఏమిటే ఆ రహస్యం? నాకూ చెప్ప కూడదూ? నేనూ సంతోషిస్తానూ.

ఒ. చె : అటు చూడవే నీ సింగారం కొంచెం సేపు కట్టి పెట్టి.

(కువేణి ఆత్రంగా అటు చూస్తుంది. విజయుని అనుచరులు కన్పిస్తారు...కొంచెం ఆలోచించినట్లు నటించి, చిటిక వేస్తుంది. ఓ చక్కటి ఆలోచన వచ్చినట్లు.)

ఒ. చె: ఏమిటి కువేణీ అంత చక్కటి ఆలోచనా? మాకూ చెప్పకూడదూ?

కు ; ఏం లేదే, వాళ్ళు మన దగ్గిరికి రానీయి. చూడు ఏం చేస్తానో.

రె. చె : అలా అనకు కువేణీ. పాపం ! ఎవరో పరదేశీల్లా వున్నారు. చూస్తూంటే బాగా అలిసిపోయినట్లు కూడా, నీ వేళాకోళాలకి వాళ్ళని బానిసలుగా చేయకు.

కు : పోవే, నీ మాటలూ, తీరూ– చూస్తే, వింటే అప్పుడే పరదేశికి నీ హృదయం వశమయి పోయినట్లుందే !

ఒ. చె : అది కాదు కువేణీ, పరదేశీలకి, అతిధి పూజా పునస్కారాలు చేయాలి కాని, ప్రాయిశ్చిత్తం కాదు కదా?

కు ; నేనేమో చేసేయనే ! అంత బాధ పడిపోతావు దేనికీ ఉట్టినే తమాషా చేస్తాను అంతే.

ఒ. చె; ఓస్, అంతే కదా. సరేపోవే అయితే వాళ్ళని దగ్గిరకి పిలవమన్నావా?

కు : రమ్మనవే.

(చెలికత్తె లిద్దరూ రెండో వైపునకు వెళ్ళి విజయుని స్నేహితులని సమీపిస్తారు. ఇటు కువేణి తల వంచుకొని పూలు కట్టడంలో నిమిగ్న అయి వుంటుంది.)

ఒ. చె : నమస్కారాలు బాటసారీ (అతి వినయంతో అంటుంది.)

చం : నమస్కారం సుందరాంగీ, ఎవరు నీవు?

ఒ. చె : ఈ దేశపు రాజ కుమార్తె అనుంగు చెలికత్తెలం. బాటసారీ. నీవెవరు?

చం : నేనెవరినైతే ఎందుకులే ప్రస్తుతం దారీ తెన్నూ తెలియని ప్రయాణాలు చేస్తున్నాం.

రె. చె : ఎవరూ. నీవూ యీ స్నేహితుడూనా :

చ : అంతే కాదు సుందరాంగీ, నీవో రాకుమార్తె కెటుల నెచ్చెలివో. నేనూ అలాగే ఒక రాకుమారుని అనుంగు చెలి కానిని, కాని కాల వశాన మేం యిలా గమ్యం లేని ప్రయాణం చేయ వలసి వచ్చింది. మా విజయుడు సుకుమారి. అందుకే అలసిపోయి. యింకొక్క అడుగైనా వేయనంటూ ఆ చెట్ల నీడను విశ్రమించాడు. మేం మటుకూ యిలా తిరుగుతున్నాం ఏదైనా నివాస యోగ్యమైన ప్రదేశం కానవస్తుందేమో అన్న ఆశతో. సుందిరాంగీ నీ చెలికత్తె ఎక్కడ?

చె : అదిగో దూరాన పూలు కడుతూ కాలం వృధా చేసుకొంటూంది. రండి. వెడదాం.

(చెలికత్తెల వెనక విజయుని అమచరులు నడిచి కువేణిని సమీపిస్తారు. కువేణి నమ్రతతో లేచి నిలుస్తుంది.)

ఒ. చె : కువేణి, వీరు పరదేశీలు. దారి కానక తిరుగుతూ యిటు చేరారు.

కు : పరదేశీలకి నమస్కారం.

చం : సుందరాంగీ, మాకు విశ్రామించడానికెదైనా స్థలం చూపకలవా? అట్లయిన. మా విజయుని తోడ్తెచ్చెదను.

కు : (ఆశ్చర్యం ప్రకటితం చేస్తూ) ఎవరా విజయుడు?

చం : నీవలెనే సుందరుడు. సుకుమారి- ఉత్తమ రాజ వంశీకుడు, అలిసిసొలసి చెట్ల నీడను విశ్రమిస్తున్నాడు.

కు : అయ్యో పాపం, ముందు మీరు పోయి ఆ కొనేట స్నానం చేయండి. మీ అలసట తీరుతుంది. తరువాత చూసుకోవచ్చు.

చం : (ఆత్రంగా) ఎటాకోనేరు?

ఒ. చె : యిటు– (అంటూ దారి తీసి లోపలికి తీసుకు పోతుంది.)

కు : (విరగపడి నవ్వుతూ) యింక ఆ విజయుడెక్కడో చూడాలే !

చె : అదేమిటి కువేణీ, మరి యీ యిద్దరు పరదేశీల సంగతి?

కు : వాళ్ళకేం ప్రమాదం లేదులేవే. మళ్లీ వీరి స్నేహితుడు విజయుడు నన్ను వచ్చి వేడుగొనే దాకా వారు నా బందీలే!

చె : అంటే?

కు : ఓసి పిచ్చీ. అంటే యిదీ అర్థం—విజయుడు నా లాగే సుందరుటడగా. చూద్దామనీ.

చె : (నవ్వుతూ) తెలిసిందిలే.

కు : అయితే పద, ఆ సుందరుణ్ణి వెతుకుదాం. (తెర)

ఐదవ దృశ్యం

(స్టేజికి ఒక మూలగా విజయుడు సుఖ నిద్రలో వుంటాడు. రెండో ప్రక్క నుంచి కువేణీ ఒక చెలికత్తే ప్రవేశిస్తారు.)

కు : (అతి నెమ్మదిగా) యీ కటిక నేలమీద ఎంత హాయిగా నిద్రిస్తున్నాడో—

చె : నువ్వితని స్నేహితులని ఏంచేశావు కువేణీ?

కు : బంధించాను. ఈ విజయుడెవరో, యితని రాజ ఠీవి ఏంతటిదో తెలుసుకుందా మనీ. అంతకంటే. ఏం లేదులే. ఏం— ఎందుకూ అంత భయం?

చె : అది కాదు చెలీ, పాపం ఆ చంద్రశేఖరుడెవరో చాలా మంచి వాడులా వున్నాడు. అతను కష్టపడ్డం నాకిష్టంలేదు.

కు : అతనేం కష్టపడడు లేవే, యీ రాకుమారుడు ఎలాగా విడిపించక మానడు.

చె : అంటే?

కు : అంటే ఏంలేదూ, యీ రాకుమారుడు నిజంగా ఆ చంద్రశేఖరుడు చెప్పినట్లే వున్నాడు. మనం పిలిచి అతిథి సత్కారాలు చేస్తే ఆదరిస్తాడంటావా?

చె : తప్పక కువేణీ, నిన్ను చూడాలే కాని....

కు : పోవే....

చె : చూస్తాంగా....

(చెలికత్తె నిద్రిస్తూన్న విజయుని చెంతకు వచ్చి చేతులు తట్టి లేప ప్రయత్నిస్తుంది. విజయుడు బద్ధకంగా యిటు నుంచి అటు తిరిగి వుండు చంద్రశేఖరా- అంటూ మళ్లీ నిద్రలో పడిపోతాడు. చెలికత్తె మళ్లీ కువేణి చెంతకు వస్తూ.)

చె : చూడు కువేణీ, పాపం. ఎంతగా అలిసిపోయాడో, ముఖం ఎంతగా వాడిపోయి వుందో చూశావా?

కు : ఏం చేద్దాం చెప్పవే త్వరగా, ఎలాగేనా లేపు మనింటికి తీసుకుపోదాం,

(చెలికత్తె మళ్లీ విజయుని చెంతకు వెళ్ళి చేతనున్న తామర మొగ్గతో తట్టి లేపుతుంది. విజయుడు ఉలిక్కిపడి లేస్తాడు. ఎదురుగా యిద్దరు సుందరాంగులు నిల్చి వుండడంతో మరి ఆశ్చర్యంతో లేచి నిలుస్తాడు.)

కు : పరదేశికి సుస్వాగతం. (నమస్కరిస్తుంది)

వి : ఎవరమ్మా మీరు?

కు : (అర్థయుతంగా చెలి వైపు చూస్తుంది.)

చె : రాదేశాధీశుని ముద్దుల కుమార్తె కువేణి. ఎవరో పరదేశీలు అలసిసొలసి పడి వున్నారని విని ఆత్రంగా చూడవచ్చాం. మీరు సమ్మతిస్తే మిమ్ములను మా కుటీరానికి తీసుకు వెడతాం.

వి : చాలా సంతోషం, కాని....

చె : వెను తీయకండి రాకుమారా, మా చెలి చాలా నొచ్చుకుంటుంది.

వి : నాకు రావడానికేం అభ్యంతరం లేదు. కాని నా స్నేహితు విదువురు వుండాలి. వారెటు పోయారో, నేనిక్కడే వుండి వారి రాకను నిరాక్షిస్తూంటాను, నన్ను రాకుమార్తె క్షమించాలి.

కు : మీరు మా పర్ణశాలకి రండి రాకుమారా మీ స్నేహితుల కోసం మనుష్యులను పంపి వెతికింప వచ్చు.

వి : అలా కుదరదు రాకుమారీ, నేనిక్కడే వారికై నిరీక్షిస్తాను.

కు : (విచారంగా చెలికత్తె వైపు చూస్తుంది)

చె : మీరలా అనకండి. మీ స్నేహితులు ఎక్కడో బందీకృతులై వుంటారు. వారి నెటులైనా వెతికించి తెస్తాం, మా చెలిని నిరుత్సాహ పరచక రండి.

వి : క్షమించండి మీరిరువురూ, నేనలా స్నేహితులకి ద్రోహం చేయలేను. మీరు వెళ్ళండి. నా స్నేహితులు వచ్చేదాకా నేనిక్కడే వుంటాను, మీ స్నేహితులు తప్పక వస్తారని, వచ్చేలా చేస్తామనీ మాట యిస్తున్నానుగా. (చెలి కేసి తిరిగి) పోయి చూసిరావే— వారూ వచ్చేకనే వెడదాం.

(కువేణి విజయుని సమీపంలో కూర్చుండి పోతుంది. చెలికత్తె నిష్క్రమిస్తుంది.)

వి : రాకుమారీ, యిదేదేశం? నీ వింత అందకత్తెవి ఒకే ఒక చెలికత్తెను వెంట నిడుకొని యిలా విహరిస్తున్నావే? యీ దేశంలో భయంలేదా మహిళలకి?

కు : (సిగ్గుతో తల వంచుకొని) రాకుమారా, మా దేశం రాక్షస దేశం. ఇది రాక్షస రాజ్యం, నేనో.... రాక్షస పుత్రిని. మాకు దేన్ని చూసి భయం చెప్పు.

వి : (చిరునవ్వు నవ్వుతూ) రాకుమారీ, సిగ్గుతో యింకా కుచించుకు పోతాంవెందుకు? రాక్షసాంగనవైనా నీ సౌందర్యం ముందు దేవాంగనల సౌందర్యం.... సూర్యుని ముందు దివిటీలా వెలవెల పోతుంది. నీ తనూలత తటిల్లతలా మానవ హృదయాలని భ్రమంప చేస్తూంది....

కు : రాకుమారా, చాలు నీ వర్ణన. నాతో కూడా వచ్చి మా తండ్రిగారి ఆతిథ్యం స్వీకరించు. మమ్ములని ఆనందింప చెయ్యి. లే, నీ స్నేహితులతో నా చెలికత్తెలు వస్తారు.

వి : (సాభిప్రాయంగా) పర్ణశాల అందే నీ చెలి ?

కు : నిన్ను చూచి అభిప్రాయం మార్చుకున్నాను. నిన్ను తిన్నగా నాన్నగారికే ఒప్పచెప్తాను ...

(కువేణి విజయుడు నిష్క్రమిస్తారు...) (తెర)

ఆరవ దృశ్యం.

(రాక్షసాధీశ మందిరం. విజయుడు ఆసీనుడై వుంటాడు. పక్కవే వృద్ధ రాజు కూర్చుని వుంటాడు. తండ్రి పక్కగా కువేణి నిలచి వుంటుంది.)

రాక్షస రాజు : అయితే నీ కథ ఇదన్న మాట. నీకు యోగ్యత వుంది. శౌర్యం కూడా వుంది. నా కువేణిని నీకిచ్చి వివాహం చేస్తాను..... ఎప్పటికైనా నీవే దాడి వెడలి ఆ సేనాధిపతికి బుద్ధి చెప్పవుగాని. ఇక్కడ హాయిగా వుండు. (కువేణివైపు తిరిగి) నీ యిష్టం నాకిదివరకే విదితం చేశావుగా తల్లీ. వెళ్ళు చెలికత్తెల నలంకరించమను.

వి : నాదొక మనవి, నా మిత్రు లిరువురు కానరాకుండా పోయారు.

కు : వారు మీరాకకై మీ మందిరం తగ్గిర వేచి వున్నారు:

వి : ఆఁ అలాగా, ధన్యవాదాలు రాకుమారీ నీ మేలు మరువను— నేను సెలవు తీసుకుంటాను" రాజా.

రాజు : వెళ్ళిరా నాయనా, త్వరలోనే వివాహం జరిపించే యేర్పాట్లుచేస్తాను. (కువేణితలనిమురుతుండగా తెర)

ఏడవ దృశ్యం.

(ఉద్యాన వనంలో కువేణీ విజయుడు మాట్లాడుకుంటూ వుంటారు. చంద్రశేఖరుడు కువేణి చెలికత్తెతో ప్రవేశిస్తాడు.)

వి : ఏం చంద్రశేఖరా?

చం : రాకుమారికి నమస్కారం, ఏం లేదు రాకుమారా, నీ సుఖం నువ్వు చూసుకుని మమ్మల్నిలా .... (సాభిప్రాయంగా చెలికత్తె చూస్తాడు)

కు : (కిలకిల నవ్వుతూ) దానికేం మహాభాగ్యం! ఎంత రాక్షసులం అయినా గాంధర్వం వుండనే వుందిగా....

వి : అవును కువేణీ, తండ్రిగారి అనుమతి తెస్తావా? నా ప్రాణమిత్రుడు, నాకై అడవులపాలైన సహచరుడు....

కు : అంత ప్రాథేయ పడకు రాకుమారా, నా చెలికత్తె అంత తెలివితక్కువదేం కాదు. ముందే తన మార్గం సుగమం చేసుకున్న నెరజాణ!

చె : అదేమిటి రాకుమారీ. (సిగ్గుతో తల వంచుకుంటుంది.)

వి : ఎంత అదృష్టవంతులం చంద్రశేఖరా మనం? నా చెలికత్తె ముఖ బింబం చూడు నిండుపున్నమి నాటిన చంద్రుణ్ణి సహితం ధిక్కరిస్తూంది. నీచెలికత్తె ముఖం చూడు! జేవురించి ఎఱ్ఱ తామర లాగ వుంది.

కు : పరదేశీ, ఏమిటా వర్ణన?

వి : అవును కువేణీ పరదేశినే. కాని యీ దేశం నా హృదయాన్ని దోచుకుంది. చంద్రశేఖరా, మామగారి ఆజ్ఞ: కొద్ది రోజుల తరువాత మనం సింహబాహు దేశం మీదికి దాడి వెడదాం. వారిని లొంగదీసుకొని యీ దేశపు పెల్లలని విస్తృతం చేద్దాం. నువ్వు వెళ్లి నీ అనుంగు నెచ్చెలితో హాయిగా కాలక్షేపం చెయ్యంరా, రాణీ యీ సుందరనందన వనంలో యీ లోకాన్నే మరచిపోయి విహరిద్దాం .... (తెర)

★

కథానిక

ఎదురు చూసిన అతను!

వై. భాస్కరలక్ష్మి

కమల దృష్టి సరాసరి కాంపౌండులోకి కేంద్రీకరింప బడింది ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు.

అదిగో. అతనే సందేహములేదు. గంటల తరబడిగ తాను ఎదురు చూస్తున్నది ఆ వ్యక్తి కోసమేగా! కమల సంతోషానికి మేరలేక పోయింది. ఈ రోజైనా తన ఆశలు ఫలించాలని దేవుని ప్రార్థించింది. ఇటే వస్తున్నాడు. అబ్బ: ఎన్నాళ్ళకి ఇంత అదృష్టం, తన దగ్గరకు రకు తప్పకుండ వస్తాడు. అని ఊహిస్తూ కుర్చీలోంచిలేచి వరండాలోకి వెళ్ళింది చూద్దామని.

"ఎక్కడికికమలా ప్రయాణం?" అంది రూమ్ మేట్ సరోజిని. కమల మనస్సు చివుక్కుమంది. సరోజిని మీద తగనికోపం వచ్చింది. ఎంత రూమ్మేట్ అయితే మాత్రం, అవసరములేని విషయం ఒక్కటి ఉండదు ఈ సరోజినికి! ఎక్కడకి వెళ్తామనుకున్నా శకునిపక్షిలా వేస్తుంద ప్రశ్న ఎక్కడికని, కమల వినిపించు కోకుండ గుమ్మం దగ్గరకు వెళ్ళింది.

"పోని ఎక్కడికైనా వెళ్తే వెళ్ళావుగాని కాస్త నా పెన్ను యిచ్చి వెళ్ళు తల్లి" అంది సరోజిని. కమల వెనుకకు తిరిగి "ఏమిటి?" అంది.

"నా పెన్ను, యిందాకనువ్వు తీశావుగా" అంది సరోజిని కాస్త గట్టిగా. "ఏ పెన్ను నాకెప్పుడిచ్చావు" అనిఅడిగింది! కమల. "రామ రామ యిదొక అబద్ధం కూడానా? గంట క్రిందట విషయం మరచిపోతేఎలా, అయినా నిన్నని ప్రయోజనంలేదు ఇదంతా ఆ ఆఖరిసంవత్సరంమహిమ" అనిగొణుగుతూ కమల మంచంమీద చిందరగా పడిఉన్న పుస్తకాలు, అలమరాలోను వెదుకనారంభించింది సరోజిని.

ఈ గొడవ వదిలితే చాలురా భగవంతుడా అనుకుంటూన్న కమల ఇదేసమయమని, రూమ్ లోంచి బయటపడింది.

తను ఎవరికోసమైతే నిరీక్షిస్తున్నదో ఆవ్యక్తి మేడమీదకు రానే వచ్చాడు. తప్పకుండా తన వైపునకే కూడ వస్తున్నాడు. కమలకు ఆత్రుత హెచ్చయింది. తప్పకుండ తనవైపు చూస్తాడనుకుంది. కాని చూస్తూఉండగానే తనప్రక్కనుండే వెళ్ళిపోయాడు. ఇంతసేపుగా నిరీక్షిస్తున్న శ్రమ వృధా అయింది. ఆశలన్ని అడియాశలయ్యాయి. వికసిత వదనారవిందం అంతలోకే ముకుళించుకుంది. ఆశాభంగం. తనేం తప్పు చేసింది? ఈరోజైన తప్పక తన దగ్గరకు వస్తాడని తన కోర్కె ఫలిస్తుందని కలలుకంది. దైవం తనపట్ల పూర్తిగ ప్రతికూలిస్తున్నాడు. ఎలాగోశరీరాన్ని మెల్లగ మంచం వద్దకు చేర్చింది. తల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. మనస్సు వివిధ దేశాలలో పర్యటించడం మొదలు పెట్టింది.

"మంచంమీదే ఉంచుకుని తెలియదంటావు" అంది సరోజ. కమల నిశ్శబ్దాన్ని వాంఛిస్తూంది అందుచేత సరోజనితో సంభాషించాలనిపించలేదు. కనీసం అడిగిన ప్రశ్నకైనా సమాధానం కూడ యివ్వకుండ మంచంమీద పడుకుంది. సరోజినికి, కమల విషయం ఏమి అర్థంకాలేదు.

కమల, సరోజిని ఆనర్సు చదువుతున్నారు. క్లాసుమేట్సు కాకుండ రూమ్మేట్సుకూడ. స్వభా

వాలు మాత్రం వేరుగ ఉండేవి. అభిప్రాయాలు భిన్నంగాఉన్నా వారి స్నేహానికి మాత్రం ఎటు వంటిలోపము లేకపోయింది. కమల మితభాషి. ఎలాంటి కష్టాలు వచ్చినా, మనస్సులో బాధ పడటమేగానిపైకిచెప్పదు. సరోజిని వట్టిగాభరా మనిషి. గోరంత విషయం కొండంత చేస్తూంది. ప్రతివిషయంలోను ఖంగారే. కమలపై తగని అభిమానం. రోజూ సాయంకాలం కమలతో కొంతసేపైనా హాస్కు కొట్టందీ పుస్తకాలు తీసే దికాదు. చివరకు పరీక్షలైనా సరే.

రాత్రి పదిగంటలైంది. సరోజిని చదువు తూంది. కమల భోజనం అయిన వెంటనే నిద్ర పోయింది. నిద్రలో పలవరించటం మొదలు పెట్టింది. అదిగో! అతనేవస్తున్నాడు, నా వంకే. ఈరోజు ఆశాజ్యోతి ఫలిస్తుంది. రోజూ సమయానికి వస్తాడు!

ఇదంతా పరీక్షగా విన్న సరోజినికి మతిపోయింది. ఓహో ఇదాసంగతి. తను ఎవరికోసమో కలలు కంటుందన్నమాట! అందుకే పదిరోజుల నుండి అమ్మాయిగారికి పరధ్యానం హెచ్చయినది. సాయంత్రం అయ్యేసరికి వీధికచేరి, వేస్తూ ఉంటుంది. పోని ఆ విషయం ఏదో పైకే ఏడవ రాదు? భయందేనికి అనుకుంది. ఒక్కసారి సుధాకర్ విషయం తలుచుకుంటే జాలివేసింది. అమాయకుడతను. ఎంతటి మోసానికి తల పెట్టింది ఈ కమల అనుకుంది. కాని మళ్ళీ తనే తప్పభిప్రాయం పడుతున్నా నేమో, అయిన నిద్రలో అనేక విషయాలు పలవరిస్తూంటారు. అవన్నీ నిజమౌతాయా ఏమిటి అనుకుంది. ఎన్ని విధాలా ఆలోచించిన తృప్తి అయిన సమాధానం ఒకటి కనుపించలేదు సరోజినికి.

మరుచటిరోజు సరోజిని హాస్టలుకు రావటం కొంచెం ఆలస్యమైంది. వచ్చేసరికి కమల మంచం మీద పడుకుని ఉంది. ఏదో అంతులేని ఆలోచనలతో సతమతమౌతూంది.

"అలా పడుకున్నావేం కమలా?" అంది.

"ఏమిటో నాకు వంట్లో సరిగాలేదు సరూ,"

"ఏం జ్వరమేమైనా వచ్చిందా?"

"అబ్బే అదేమికాదు నాకు నిద్ర వస్తుంది, నన్ను మాట్లాడించకు లెద్దూ" అంది కమల కళ్ళు మూసుకుంటూ.

"అబ్బో కథ చాలాదూరమేపోయింది. నేను మాట్లాడితే ఊహా గానంలోని విహంగయానానికి బ్రేకులు పడుతుంది కాబోలు అయినా నాకెందుకు" అనుకుంది సరోజ. కనీసం రాత్రి ఎందుకలా పలవరించావు అని కూడ అడగాలని పించలేదు సరోజకి.

ఇంతలో దాసీపిల్ల గౌరి కాఫీ తెచ్చింది. సరోజినికి కాఫీత్రాగి అవతలకువెళ్ళి గౌరినిపిలిచి "కమల ఈరోజు కాఫీత్రాగిందా" అనిఅడిగింది.

"త్రాగుతూండగానే ఎవరో తెలిసినవారు వచ్చినట్లుంది గదిలోంచి బయటకు వెళ్ళారు."

"ఎవరువచ్చారుగౌరి మొగవారా? ఆడవారా?"

"మగవాళ్ళె, ఒక్కరే లాగుందమ్మా"

"పెద్దవాడేనా చిన్న అబ్బాయా?"

"ఏమో తల్లి నేనంత పరీక్షగాచూడలేదు."

"వచ్చినతను రూమ్‌లోకి వచ్చాడా" అంది.

"లేదు కమలమ్మగారె వెళ్ళి మాట్లాడి వచ్చారు. లోపలికి వస్తూనే యింక కాఫీ వద్దు, కప్పుతీసుకునివెళ్ళిపో అన్నారమ్మా" సరోజినిలో జనించిన అనుమానానికి గౌరి చెప్పిన మాటలు సాక్ష్యాలుగా అనిపించాయి. అయినాతనకెందుకీ గొడవ వినాశకాలె విపరీత బుద్ధి అన్నారు అను కుంటూ రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

రాత్రి పుస్తకాల వద్ద కూచున్నదన్నమాటే గాని మనస్సంతా కమల విషయమే ఆలోచిస్తూంది. ఏమిటిఇలాగమారిపోయింది అనుకుంది.

కమల మీద ఉండే ప్రేమాభిమానాలు అంతరించిపోయాయి. విద్యవల్ల కమలకు విజ్ఞానం రాలేదనుకుంది. అయిన యింత చపల చిత్తం అయితె ఎట్లా అనుకుంది. ఈరోజుకూడ యధాప్రకారంగా పలవరించటం మొదలు పెట్టింది. అదిగో అతనే ఈరోజు తప్పకుండ వస్తాడు. తన యిష్టఫలం నెరవేరుస్తాడని కాని అయ్యో ఈ నాడుకూడ ఇంతేనా, తాను దరహాసితవదనంతో అతనిని ఆహ్వానించిందే, కాని దృష్టిని తన తనవైపు పారేస్తె తప్పా అని ఏదో ఇంక అంటూనేఉంది. కాని ఈరోజు సరోజిని మరి భరించలేకపోయింది. తనలో పొడచూపిన అనుమానం ధృఢమైంది. ఈ సమాచారం తన ఫ్రెండ్ జయలక్ష్మికి చెప్తెనో, అనుకుంది. అనుకున్న దే తడవుగ జయలక్ష్మి రూమ్‌కి వెళ్ళింది.

"రా, సరోజా రా, ఏమిటి విశేషం యింత అర్ధరాత్రి ఇలా దయచేశావు అంది."

"ఈ మధ్య మా కమల నా తలకి బాగ మేతపెడుతూంది దాని వ్యవహారం ఏమి బాగ లేదు జయా" అంది సరోజిని.

"ఏం వంట్లో బాగులేదా లేక జ్వరమేమైన వచ్చిందా" అంది.

"జర్వం కాదు పాడుకాదు. ఏదో వర్ణాతీతమైన బాధ ఆమెగారికి. అయినా అసలు జాడ్యం వేరులే" అంది మెల్లగా.

"అదేమిటి ఈ రోజు వింతగ మాట్లాడుతున్నావు"

"మనుష్యుల తత్వాలు మారుతూంటె మనం వింతగానే మాట్లాడవలసి వస్తుంది."

"నీ మాటలు నాకర్ధము కావటంలేదు సరూ కాస్త స్టేజిధోరణి విడచిపెట్టి వివరంగ చెప్పవే"

"ఏం చెప్పమన్నావు. పదిరోజులనుండి కమల పూర్తిగ మారిపోయింది. మనిషి యిక్కడ మనస్సు మాత్రం గగనవీధుల్లో. పరధ్యానం ఎక్కువయింది. మాట్లాడిస్తే విసుగు, కమలకి రాత్రి పలవరించే అలవాటు. సాధారణంగ పగలంతా అనుకున్న విషయాలు రాత్రి నిద్రలో పలవరిస్తుంది. నాల్గురోజులై రాత్రి వింటూంటే నాకేమిటో అనుమాన మేస్తోంది."

రోజు సాయత్రం ఎవరో తనతో వస్తానని ప్రమాణం చేసినట్లుగ ఎదురు చూస్తూంటుంది. పైగా అతను వచ్చినా తన దగ్గరకు రాలేదు మాట్లాడలేదు అని బాధ పడుతుంది."

"అదేమిటి సరోజా ఇలామారింది! అయినా తనకు పెండ్లికూడ అయింది కదూ!"

"అయింది కనుకనే మనం యిప్పుడు అనుకోవటం. ఫోర్తానర్సు చదువుతూ ఉండగానే సుధాకర్‌తో అయింది. పాపం అతని మాట తల్చుకుంటె జాలేస్తుంది. అంది సరోజిని.

"అతను మంచివాడు కాదా ఏమిటి సరోజా?"

"అన్యాయం, అతను చాలమంచివాడు బుద్ధికి బృహస్పతి అని చెప్పవచ్చు. రూపానికి మన్మధుడు. పైగ ఇంజనీరింగ్ పేసయ్యాడు. ధనవంతునిబిడ్డ. ఒకమాటలో చెప్పాలంటె కమలకే విషయంలోను తీసిపోడు మొన్ననే గవర్నమెంటు అమెరికాకు పంపించారు అంది."

ఎన్ని డిగ్రీలున్నా కమల కిష్టంలేదేమో
"అబ్బే ఇద్దరూ ఎంతో యిదిగా ఉండేవారు."
"అమెరికాలో అతనెన్నాళ్ళుంటాడూ?"

మూడేళ్ళుట ఈసంవత్సరం కమలకూడ పరిక్షలవగానే అమెరికా తీసుకొని వెళ్ళేందుకు ఏర్పాట్లు చేశాడట. తను వెళ్ళేరోజు స్వయంగ వచ్చి నాతో చెప్పాడు. కమలని జాగ్రత్తగా చూస్తూండండి. అనవసరంగా నాకోసం బెంగ పెట్టుకోవద్దని, కాస్త శ్రద్ధగా చదవమని, చెప్పండి. మీరు తన ఫ్రెండ్ కనుక చెప్తున్నాను."

అంటూ ఎంతో దీనంగ చెప్పాడు. కమల ఆరోజు మనిషి మనిషిగాలేదు. అంది సరోజిని.

"అతను వెళ్లి ఎన్నిరోజులైంది?"

"నెలరోజు అవుతుంది."

"నీవు అనవసరంగ తనమీద అపోహ పడుతున్నావేమో."

"నేను అలాగే అనుకుని ఊరుకున్నాను. కాని గారి కూడ స్పష్టంగ చెప్పింది. ఎవరొవచ్చారని పైగ రాత్రి ఒక ప్రబంధనాయికలా పలవరిస్తూ ఉంటూంది. ఇంతెందుకు రేపు సాయంకాలం నీవు మారూమ్‌కిరా. ఇద్దరం కలసి వ్యవహారం ఏమిటో కనిపెట్టవచ్చు."

సాయంకాలం కాగానే జయలక్ష్మి అనుకున్న ప్రకారముగ హాజరయింది.

కమల పుస్తకాలు తిరగేస్తోంది చదువుతున్నట్లుగా

"నీవంట్లో ఎలావుంది కమలా" అని అడిగింది.

"బాగానే ఉంది అంది" ముక్తసరిగా.

జయ సరోజిని ఎంతగొడవ చేస్తూన్న వారి దృష్టిలేకపోయింది కమలకు. పుస్తకాలు పట్టుకు ఉండుండి కిటికీగుండ కాంపౌండులోకి చూస్తూంది. ఇదంతా వీరిరువురు కనిపెడుతూనే ఉన్నారు.

నిజంగా గేటుదగ్గర ఎవరో నిల్చున్నట్టయింది జయకి. ఎవరో వస్తున్నట్లుంది సరొజ నీకోసమే కాబోలు అంది కాస్త ఎగతాళిగా ఈ మాట కమలకు పాకులా అనిపించి పైకి చూచింది. అదిగో అతనే ఒక్క క్షణంకూడ నిలబడలేక పోయింది. నేరుగ వరండాలోకి వచ్చి నిలపడింది. కాని కమలకు ఆతృత హెచ్చయింది త్వరత్వరగ నడుస్తు సరాసరి అతని ఎదురుగ వెళ్లింది. కమల హడావిడిలో ఆవచ్చిన వ్యక్తి స్పష్టంగ వారికి కనుపించలేదు కమల వెంటనేవారుకూడ క్రిందికి దిగివెళ్ళారు పెద్దడిటెక్టివుల్లాగ. అతనికి ఎదురుగ వెళ్లి నిలబడింది ఆరాధ్యదేవత ఈ రోజునైన కరుణిస్తాడు. రోజులుగ నిరీక్షిస్తున్న కమల ఆశయం ఫలించింది. అతను తన దగ్గరకు వచ్చాడు తనకోర్కె చెల్లించాడు. తను తన శ్రీవారివద్ద నుండి ఉత్తరం కోసం ఇన్నిరోజులుగ ఎదురు చూస్తూంది. ఆ ఫలితంగానే అతను ఒక బ్లూ కవరు కమలచేతి కందిచ్చాడు. సంతోష తరంగాలు కమల ముఖంలో ఒక్కసారిగ నాట్యం చేశాయి. ఆనందంతో తొందరగ రూమ్‌కువెళ్లి చదవాలనుకుంది. వెనుకకు తిరిగేసరికి జయ, సరోజ కనుపించారు. "అబ్బ వెళ్లిన ఎన్ని రోజులకు రాశారో చూడు సరూ! నేను దీనికోసం కన్నులు కాయలుకాసేల ఎదురు చూచాను" అని ఉత్తరం చదువుతూనే పరుగెత్తింది కమల.

అతను, అతను, వస్తాడు అంటే నాయకుడెవరో ఈ విడకోసం వస్తున్నాడను కున్నాడు. నంబె పోస్టుమేనా!!" అంది సరోజ

నాతల్లి మాఅమ్మ ఎంత గొడవ చేశావు. పాపం వాళ్ళ శ్రీవారి వద్దనుండి జాబుకోసం ఆమె తంటాలు. పడుతూంటే అన్యాయంగ అభాండం వేశావు తలమీద!"

"నాకేం కమలంటే పగా తను లెటర్‌కోసం చూస్తున్నాను పోస్టువాడు ఇంకారాలేదు అనక అతను రాలేదు. ఈ రోజైనవస్తాడు అని పిచ్చిగ అంటూంటే ఏదోఆపోహపడ్డాను" అంది సరోజ.

"అయినా నీవువట్టి గాభరామనిషివి. ఇదిగో పులంటే అదిగో తోకంటావు సరోజ" అంది జయ నవ్వుతూ.

★

కధానిక

గతి తప్పిన నర్మద

—ఎస్. నిర్మలాకృష్ణమూర్తి

పాప నిదురపోసాగింది. ఆకాశములో నీలిమబ్బుల మేఘాలు చంద్రుడిని కమ్మివేస్తున్నాయి. పాప మనస్సు ఆచల్లని సమయంలో ఎన్నిలోకాలు దాటిపోయి ఉయ్యాలలో చేరుతుందో చెప్పలేము. మెల్లగా చేతిలోని ఉయ్యాల జారిపోయింది, ఐదారుసార్లు అటు ఇటు పచార్లు చేసి తన గమ్యస్థానంలో నిల్చిపోయింది. గోడమీద గడియారం టంగ్ టంగ్ మని తొమ్మిది కొట్టింది. ఇంకా ఇంటి గుమ్మం చేరలేదు క్రిష్ణారావు. ఎంతసేపని చూడను? చాలా విసుగు అనిపించింది నర్మదకు. పాపము ఏమీ పాలుపోలేదు, గడియారం పదిచూపింది.

"నర్మదా! నర్మదా!" అని తలుపు చప్పుడు చేశాడు క్రిష్ణారావు. నర్మద హాలులో లైటు వెలిగించి ద్వారము తెరచింది. ఆయన రావటమే తడవు చెప్పులు మూలకు చేరుకున్నాయి. తిన్నగా పట్టుస్టాండుకు తగిలించాడు. గబగబా బాత్ రూము ప్రవేశించి నర్మదా వేడినీళ్లు పెట్టావా అని అడిగాడు. నర్మదకు పైప్రాణాలు పైకేపోయాయి. ఏమీ జవాబు చెప్పలేక మరచిపోయానండి అన్నది నర్మద.

నీవు ఎక్కడ వున్నావు. ఈ ప్రపంచములో లేవు. పదింటికి బయటకు వెళ్ళినవాడిని ఆసంగతి ఏమీ నీకు పూర్తిగా కొంబట్టడం లేదు. అమ్మగారికి అరికాళ్లు నడి నెత్తికి వస్తున్నాయి. గబగబా అనవలసిన మాటలు ఏమేమో అనేశాడు క్రిష్ణారావు. ఎందుకు ఈరోజు ఇలా కోపంగా ఉన్నారు అనుకొన్న నర్మద స్టాండుకివున్న షర్టు జేబులో చెయ్యివేసి తీసింది ఒక కవరు. అది ఎవరు వ్రాశారా అని ఆత్రుతతో చూసింది. సుబ్రహ్మణ్యం వ్రాశాడు.

క్రిష్ణారావు భోజనానికి కూర్చున్నాడు. వడ్డించివచ్చి నర్మద ఉత్తరం ముగించి యధాస్థానంలో పెట్టింది. నర్మద గుండె అతివేగంతో బీర్వావైపు ప్రసురింపజేసింది. కాని ఏమిలాభం? ఇవ్వవలసిన సొమ్ము ఎలాగైనా యివ్వవలసిందే!

క్రిష్ణారావు భోజనం ముగించి ఆత్రుతతో ప్రక్కమీద వాలాడు. నర్మదకు భోజనం సహించలేదు. ఉండే సామానంతా పనిమనిషికిపడేసి వంటగదిసర్ది కడిగి తలుపులు గడియపెట్టింది. పాపమీద చేయివేసుకు పడుకుంది.

ఎన్ని రోజులకు తీరుతుందో ఈ డబ్బు, అబ్బ! మంచి బెడద నా నెత్తిమీదకు పడింది అనుకున్నాడు. పాపము చెల్లెలికి అప్పుచేసి పెండ్లి చేశాడు. ఆ అప్పు ఇంతవరకు తీరలేదు. బుర్ర పిచ్చిపిచ్చి ఆలోచనలలో తిప్పివేస్తుంది. పోనీ నర్మద మెడలోని సొమ్ములయినావున్నాయా? తగినంత సొమ్ము లేదు.

తెల్లవారినర్మద నిత్యకృత్యాలు తీర్చుకొనటానికిలేచింది.

"అమ్మా. అమ్మా" అనిపిలిచింది పనిమనిషి లక్ష్మి. నర్మద వాకిలి తెరచింది. లక్ష్మి బోయిలర్ లో నిప్పువేసి గదులు అంతా చిమ్మి, ఉండే అంట్లుతోమి ఇచ్చివెళ్ళింది. వేడివేడినా కాఫీ, ఉప్మా చేసింది నర్మద. క్రిష్ణారావు చిరాకుగాలేచి స్నానంచేసి టిఫెనుకు రెడీ అయ్యాడు. తీయని కలలుకని నిద్రాదేవిని తప్పించుకొని కూనిరాగాలతో నిద్రలేచింది పాప. నర్మద పాపాయిని తీసుకొని టిఫెను వడ్డించింది. క్రిష్ణారావు కొంచెముసేపు పేపరు చదివి ఆఫీసుమొగం పట్టాడు.

క్రిష్ణారావు పోస్టాఫీసులో ఒక క్లర్కుగా వున్నాడు. అతనికి వచ్చేజీతం నూరు లోపుగా వస్తుంది. చూడటానికి బోలెడు ఖర్చులు. క్రిష్ణారావుకు నెలబత్యం నెలకే సరిపోతుంది. అందులో మదరాసులో జీవనం చెయ్యటం చాలా కష్టము. ఇంటిబాడుగ యివ్వాలి. పాలవాడికి, చాకలివాడికి, పనిమనిషికి, పైన ఇతర ఖర్చులు యిన్ని చూసుకోవాలి. అందులో మొన్నమొన్ననే ఇన్సూరెన్సు బుక్ ఓపెన్ చేశాడు!

నర్మద ఒక గిన్నెలో అన్నం నెయ్యికలిపి పాపకి తినిపిచ్చింది.

అమ్మగోరూ, అమ్మగోరూ, మొదటితేదీ వచ్చింది. ఇంక చేతిలో జీతం పడెయ్యరా అమ్మా అని అడిగింది లక్ష్మి. అయ్యగారు వచ్చాక తీసిపెడ్తాను అన్నది నర్మద. గోడ గడియారం పదిగంటలు కొట్టింది. పోస్టువాడు కవరు తెచ్చి యిచ్చాడు. గబా గబా ఆకవరు చింపి చదివింది.

క్రిష్ణారావుకు,

మీ తండ్రి ఆశీర్వచనములు చేసి వ్రాయు ఉత్తరము మీ అమ్మగారు, నీచెల్లెలు మద్రాసు చూడటానికి బయలుదేరి వస్తున్నారు. మద్రాసుకు 9 గంటలకు బొంబాయి మెయిల్ లో వస్తారు. నీవు స్టేషను దగ్గర వాండ్లను కలుసుకోవలసినది.

ఇట్లు మీ తండ్రి,
ఈశ్వరయ్య.

నర్మద ఉత్తరం ముగించి సెల్ఫ్ మీద పెట్టింది. లక్ష్మి పనులు అన్ని ముగించుకొని అయ్యగారికి టిఫెను క్యారియరులో భోజనం తీసికెళ్ళింది.

అబ్బ! ఆడజన్మ ఎత్తేదానికన్నా అడవిలో మానై పుట్టేది మేలు అనుకుంది. ఇన్ని ఖర్చులు ఆయన యెలా భరిస్తారో అనిపించింది. నర్మదకు పాపము తనుమటుకు ఏమి చేయగలదు. అలా ఇలా సాయంత్రము అయింది. క్రిష్ణారావు వచ్చాడు. తిన్నగా షర్టు స్టాండుకు తగించి కాళ్ళు కడుక్కొని టిఫెను తిన్నాడు. నర్మద ఉత్తరం తెచ్చి క్రిష్ణారావు చేతిలో పెట్టింది. అతను ఆ వుత్తరం చదవడంతోడనే గుండె నీరయిపోయింది. మెదడుకు ఏమీ సమాధానము చెప్పుకోలేక తొమ్మిదికి స్టేషనుకు వెళ్ళాడు.

అప్పుడు ఆ బొంబాయి మెయిల్ నిప్పులు కక్కుతూ వచ్చింది. పాపము క్రిష్ణారావు ప్లాట్ ఫారం మీద అటూ ఇటూ చూస్తూ ఆత్రుతతో కాలుజారి పడిపోయాడు. డ్రైవరు స్టేషను దగ్గరకు వచ్చిందిగదా అని ఆవేశంతో వెనక్కి తిరిగి చూస్తూవున్నాడు. ఈ సంఘటన జరిగిన మరుక్షణం రైలు చుట్టు జనం మూగిపోయారు. క్రిష్ణారావుని జనరల్ హాస్పిటల్ లో చేర్చారు. దేహం అంతా కట్లుకట్టారు.

ఆ వచ్చే రైలులో బంధువులు రాలేదు! వచ్చే నెలలో వస్తారని టెలిగ్రాం ఇంటికి వచ్చింది. నర్మద టెలిగ్రాంని చూసి సెల్ఫ్ మీద పెట్టి ఇవతలకు వచ్చింది. ఎవరో నలుగురు మగవారు వచ్చారు. ఆయన రైలుక్రిందపడ్డారు. మీరు త్వరగా రావలసిందని చెప్పారు. నర్మద హాస్పిటల్ వెళ్ళింది. క్రిష్ణారావును చూచినతోడనే మూర్ఛపోయింది. పాపము.

నర్మదకు ఈ ప్రపంచములో ఎవరూ లేరు. తన భర్త తనకు ఆధారం. అమ్మ నాన్న చిన్నప్పుడే దూరం అయ్యారు. తన ఒక బీదింటిపిల్ల. చిన్నప్పటినుంచి బాబాయి పెంచి పెద్దచేసి చదివించాడు. అప్పుడు తన అందాన్నిచూసి క్రిష్ణారావు తనను తప్ప ఇంకెవ్వరినీ పెండ్లి చేసుకోను అనటంవల్ల తల్లిదండ్రులు ఉండే ఒక్కకొడుకు మాటను కాదనలేక పెండ్లిచేశారు. పెండ్లి అయిన రెండవ సంవత్సరం పాపాయి పుట్టింది. పాపము క్రిష్ణారావు ఎంత ఇష్టపడి పెండ్లి చేసుకున్నాడో అన్నికష్టాలు పడ్తున్నాడు. నర్మదకు మెలుకువ వచ్చింది. కంటికి మింటికి ఏకధారగా ఏడువసాగింది.

డాక్టరువచ్చి క్రిష్ణారావునుచూచి ఇంక ఏమీ లాభం లేదనిచెప్పి వెళ్ళిపోయాడు. వెంటనే క్రిష్ణారావు తల్లిదండ్రులకు టెలిగ్రాం యిచ్చారు. వాండ్లు వచ్చి కర్మకాండాలన్ని ముగించి ఎవరిదారిన వాండ్లు వెళ్ళిపోయారు. పాపము నర్మదకు ఇప్పుడు ఎవ్వరూ దిక్కులేరు! పాపతప్ప.

మొన్నటిరోజు క్రిష్ణారావు ఆఫీసులో యిచ్చిన జీతం అలాగే వుంది. ఇవ్వవలసిన వాండ్లకు అప్పులుతీర్చి మిగిలిన డబ్బుతో సంసారాన్ని చేస్తూవుంది. జరిగినవన్ని జ్ఞప్తికివచ్చి నర్మద మనస్సు పాడుచేస్తూ ఉంటాయి. పాపనుచూసి గుండె రాయిచేసుకొంది నర్మద.

మరుసటి రోజు గరల్స్ హైస్కూలులో టీచర్సు కావాలని పేపరులో వచ్చింది. నర్మద సంతోషంతో అప్లికేషను రాసింది. వెంటనే నెలాఖరులోగా పనిలో చేరమని ఆర్డరు యిచ్చారు. నర్మద సంతోషానికి ఒకప్రక్క విషాదపు నీడలు. జీవితంలో ఉండవలసిన అదృష్టం లేదుకదా అని చాలా దుఃఖించింది.

నర్మద పనిలో చేరింది. రోజులు దొర్లిపోతున్నాయి. నర్మద ఎవ్వరిమీద ఆధారపడలేదు. తన జీవితం తను గడుపుకుంటూ వుంది. ఆనాడు తను చదివిన చదువు! ఈనాడు ఈ కష్టాలలో ఆచదువు వినియోగించింది. ఎప్పటికైనా ఆడదానికి చేతిలో ఏదైన ఆధారంవుండి పెండ్లి చేసుకోవాలి అనుకున్నది నర్మద. నడిసముద్రంలో తెరచాప తెగిన నావలా దిక్కుతెలియక తికమకపడి ఏం ప్రయోజనం? ధైర్యంగా ఒడ్డుకు చేరేలా చూసుకొనే నేర్పుండాలి అనుకుంది నర్మద.

కథానిక :

కనువిప్పైన మాతృహృదయం

డి. వాణి

పాపా ! నేను నిన్న రాత్రి ఊరి నించి వచ్చేశాను, శెలవులకి నీ దగ్గిరకి వెళ్ళలేదూ?, అంటూ యేడేళ్ళ రాణి, మెట్లమీద కూర్చొని బొమ్మల పుస్తకం చూస్తున్న పాపను పలుకరించింది. పాప తలెత్తి రాణి వైపు చూచి స్నేహ పూర్వకంగా నవ్వింది.

"మా అమ్మ నాకు యెన్నో గౌనులు కుట్టించింది. మా నాన్నగారు మంచి పుస్తకాలు యిచ్చారు రా చూపిస్తాను' అని పాప చేయి పట్టుకొని తన రూముకి తీసుకెళ్ళింది. అన్నీ చూపించి బిస్కెట్లు, చాక్‌లెట్లు యిచ్చింది. ఇంతలో స్కూల్ బెల్ అయింది. ఇద్దరూ క్లాసుకి వెళ్లారు. ఆ రోజే సెలవులై తిరిగి వచ్చిన పాపల ఆట పాటలతో హాస్టలంతా కలకల లాండిది.

'అమ్మా ! నాన్న !' పాప పసి హృదయం బాధగా మూల్గింది. తన నెవరూ శెలవులకి తీసుకెళ్ళరు ! తన అమ్మ యెప్పుడూ రాదు ! ఎగ్జిబిషన్‌కు తీసుకెళ్ళే నాన్న తనకు లేరు ! పాప ఆ రోజంతా దిగులుగా ఒంటరిగా కూర్చుండి పోయింది.

రాత్రి తొమ్మిదైంది. మేట్రన్ విమల తన గదిలోకి వచ్చింది. పాప పుస్తకం చదువుతూంది.

'ఇంకా పడుకోలేదేం పాపా?' అని అడింగింది:

'ఆంటీ ! ' పాప కళ్లెత్తి విమల వైపు చూచింది.

'నాకు అమ్మ లేదా ఆంటీ?' పాప పసిడి బుగ్గల మీంచి కన్నీళ్లు జారాయి.

'నీకు అమ్మ ఉందమ్మా ! ఈ సారి సెలవులకి తప్ప కుండా వస్తుంది. ఇంక పడుకో' అని లాలించింది. పాప ప్రశ్న ఆమె హృదయాన్ని కలచింది.

'అమ్మ ! ఎప్పుడు వస్తుందో?' అంటూ పాప దిగులుగా కళ్లు మూసింది.

జయ సామాన్య కుటుంబీకుల యింట్లో పుట్టింది. ఆమె అక్కలకు, అన్నలకు డబ్బంతా పెట్టిన తల్లిదండ్రులు జయ పెద్దదయేసరికి పూర్తిగా చితికి పోయారు. అన్నలు సహాయం చేయలేదు. జయ ఫోర్తుఫారం వరకు చదువుకున్నది. చక్కగా ఉంటుంది. చదువుకొనే రోజుల్లో పాటల పోటీల్లో, నాటకాల్లో పాల్గొని బహుమతులు సంపాదించింది.

ప్రకాశరావు జయ మేనత్త కొడుకు. స్కూలు ఫైనలు ప్యాసయి ఉద్యోగంలో చేరాడు. సహృదయుడు. డబ్బుగల యింటి కోడలు కావాలని జయ కలలు కన్నా పరిస్థితుల ప్రాబల్యం వలన ప్రకాశరావును వివాహం చేసుకోకతప్పలేదు. ప్రకాశరావుకి జయ అంటే యెంతో ప్రేమ, వీలైనంత వరకు ఆమె కేలోటూ రానిచ్చేవాడుకాదు. కాని ఆమెలో గూడు కట్టుకున్న అసంతృప్తి ఆమెను బాధిస్తూ ఉండేది.

జయకు కూతురు పుట్టింది. ప్రకాశరావు పాపను ఒక్క క్షణం వదిలేవాడు కాడు. కాని దురదృష్టవశాత్తూ పాపకు యేడాది నిండకముందే అతను కారు ప్రమాదానికి గురిఅయి చనిపోయాడు. తల్లిదండ్రులు కూడ లేకపోవడం వలన ఆమెను ఆదరించే వారెవరూ లేకపోయారు. ప్రశాంతంగా ఉండే ఆమె జీవితం కష్టాల పాలైంది.

రెడ్డి ప్రకాశరావు స్నేహితుడు. ప్రకాశరావు బ్రతికి ఉన్నప్పుడు తఱచుగా వచ్చేవాడు. అప్పుడప్పుడు వచ్చి యోగక్షేమాలు కనుక్కొంటూ ఉండేవాడు.

కొద్ది రోజులకు జయ స్నేహితురాలు నీరజకు జయ పడే కష్టాలు గురించి తెలిసింది. తన వద్దకు వచ్చి ఉండమని ప్రైవేటుగా చదివించి ట్రైనింగులో చేర్పించి జీవనోపాధికి దారిచూపెడతానని వ్రాసింది. కాని రెడ్డి డబ్బుతో చూపే ఆశల ముందు జయ నీరజ సలహాకి ప్రాముఖ్యం ఇవ్వలేకపోయింది. చిన్నప్పటి నించి డబ్బులేక తీర్చుకోలేని సరదాల వైపు ఆమె హృదయం పరుగులు పెట్టింది. తత్ఫలితంగా జయ సంఘపు నిందలను సహితం లక్ష్య పెట్టక రెడ్డి వెంట మెడ్రాసు వెళ్ళిపోయింది.

రెడ్డి జయను తనకు సంబంధమున్న సినిమాకంపెనీలో ప్రవేశపెట్టాడు. కొన్నాళ్ళు చినచిన్న వేషాలు వేస్తూ గడిపింది. నాలుగు సంవత్సరాల్లో అదృష్టం కలిసివచ్చి ఆమె నటించిన చిత్రాలకి విపరీతంగా ఆదరణ లభించింది. కాని జయ పూర్తిగామారిపోయింది.

జయకు రెండు పెద్ద బంగళాలు, కారుఉన్నాయి. ఆమె కోసం అందరూ ఎగరబడేవారు, ఆమెకోరినది, క్షణాలమీద లభించేది. ఇప్పుడామెకు పాపనుచూచేందుకు టైమేలేదు. ఆమె మనస్సు పూర్తిగా డబ్బుసంపాదనమీద కేంద్రీకృతమై పోయింది. పాప తనకు అడ్డుగా ఉన్నట్లు తోచేది. ఆమె మాతృహృదయపు పవిత్రతని, ప్రేమని పరిస్థితులు పూర్తిగా కప్పేశాయి పాపను చూచినప్పుడు ఆ అమాయక నేత్రాల్లో ప్రకాశరావు మెదిలేవాడు, "డబ్బుకోసం యింత నైచ్యానికి ఒడిగడతావా? కళారాధన పేరుతో యిలాతయారయావా?" అని నిలదీసి ప్రశ్నించినట్లయేది. పాప కళ్ళలోకి సూటిగా చూడలేకపోయేది. భర్తతో గడిపిన జీవితం కలగా భావించి మర్చిపోవడానికి ప్రయత్నించ సాగింది. చివరకు పాపను హాస్టల్‌లో పెట్టాలనే నిశ్చయానికి వచ్చింది

పాపను ఋషీవ్యాలీకి తీసుకెళ్ళింది.

"పాప కొన్నిసంవత్సరాలిక్కడే ఉంటుంది. డబ్బు ప్రతీనెలా పంపుతాను. కాని నేనుమటుకు తరుచుగా రాలేను? అన్నది మేట్రన్ విమలతో. పెద్ద కళ్ళతో అమాయకంగా చుట్టూ పరికిస్తున్న పాపపై విమలకు వాత్సల్యం, జాలికలిగాయి.

పాప బుద్ధిగా ఒకరిజోలికి పోకుండా చదువుకుంటూఉండేది. బొమ్మలు వేస్తూ ఉండేది. విమల ప్రోత్సహించి వాటిని మేగజైన్లకు పంపేది. చదువులోకూడ చురుకుగా ఉండేది, ప్రతి సెలవులకు పిల్లలను తీసుకొని వెళ్ళడానికి తలిదండ్రులు వచ్చేవారు. తన నెవరూ తీసుకెళ్ళరని, తనకోసం యెవరూ రారని పాప దిగులు పడేది.

మూడు సంవత్సరాలు గడిచి పోయాయి, జయ డబ్బు పంపిందికాని ఒక్కసారికూడ రాలేదు. పాపకు విమల మంచిగౌనులుకుట్టించినా, యెన్నోకొనిచ్చినా అసంతృప్తిగానేఉండేది. ఒకసారి విమలరమ్మనివ్రాస్తే వీలులేదని వ్రాసింది, ఏ తల్లి దండ్రుల్ని చూచినా విమలకు పాపపై సహజవాత్సల్యాన్ని ప్రదర్శించుకోని జయ. 'అమ్మ' రాకకోసం ఆత్రుతగా యెదురు. చూచే పాప కళ్ళలో మెదిలేవారు ఎంతో బాధపడేది.

◆ ◆ ◆

ఆంటీ ! నాకసలు అమ్మ ఉందా? మరి యెప్పుడూ రాదేం? పాప పదేపదే విమలను ప్రశ్నించసాగింది. హృదయవిదారకమైన ఆ ప్రశ్న విమలనెంతో బాధించేది. జయకు వ్రాసిన ఉత్తరాలకు జవాబే వచ్చేది కాదు.

'మీ అమ్మకు రావడానికి తీరుబాటులేదు. పాపా ! నీవు బాగా చదువుకుంటూ పరీక్షలు పాసైతే అప్పుడు వచ్చి నిన్ను తీసుకెళ్తుంది. ఏడుస్తూ ఉంటే రాదు' అంటూ లాలించింది.

పాప యిక విమలను ప్రశ్నించలేదు. తను బాగా చదువుకొని పాసైతే వస్తుందని ఆ పసి హృదయంలో ఆశ మొలకెత్తింది.

నాలుగేళ్ళు గడిచాయి. పాపకి పదకొండోయేడు వచ్చింది. అమ్మకోసం ఆత్రుత యెక్కువైంది.

ఆ క్రిస్ట్‌మస్ సెలవులకు పిల్లలంతా వెళ్ళిపోయారు పాప, విమల యెప్పటిలాగే ఉండిపోయారు. ఆ ఒంటరితనమూ, మార్పులేని వాతావరణమూ, అమ్మను చూడాలనే కాంక్ష పాప హృదయాన్ని పీడించ సాగాయి. దిగులుతో యేడుస్తూపడేకొనేది. క్రమంగా మంచం పట్టింది,

'అమ్మ యెప్పుడొస్తుంది ఆంటీ?' అంటూ రాత్రింబవళ్ళు పలవరించసాగింది. పాప అనారోగ్యం చూచి విమల బెదిరిపోయింది. డాక్టర్‌నిపెట్టి శ్రద్ధగా మందులిప్పించ సాగింది.

పాపకు కొద్దిగా నయమైంది. ఉదయం పాప పాలు త్రాగుతూంటే విమల మంచంమీద కూర్చుంది.


'అమ్మను రమ్మనివ్రాయి ఆంటీ !' అన్నది పాప. చటుక్కున విమల కొక ఆలోచన తట్టింది.

'పాపా ! నీవే మీ అమ్మను రమ్మనివ్రాయి' అంటూ కాగితం, కలం తెచ్చి యిచ్చింది. పాప ఉత్సాహంగా విమల ముఖం చూసి వ్రాసింది.

పాప ఉత్తరం, తన ఉత్తరం కలిపి పోస్టుచేసిన విమల రిలీఫ్ దొరికినట్లు ఫీలయింది.


5000 సంవత్సరాల

హస్తకళా సంప్రదాయం




కల్పనా వైభవం, నిర్మాణ చాతుర్యం, ప్రత్యంశ వైశద్యం— వీటి వలననే మన హస్తకళలు మొహెంజొదారో, హరప్పా నాటి నుండి నేటి వరకు తమ విశిష్టతను నిలుపుకొన కలిగినవి.

నా నాటికి మార్పు చెందే సంఘం అభిరుచులు, అవసరాలు కూడా నిత్యమూ పరివర్తన చెందుతూంటాయి, హస్తకళల సంస్థ రూపొందించిన కార్యక్రమం ప్రకారం మన కళాకారులు క్రొత్త పదార్థాలు వినియోగించి, నూతన పరికరాల సహాయంతో, ఆధునిక పద్ధతులలో తమ కళాసృష్టి చేయగలుగుతున్నారు. హస్తకళా వస్తువులు కళా ప్రధానములే కాక రీతి విశిష్టతకు కూడా భవిష్యత్తులో కీర్తి తెచ్చుకుంటాయి.



ఆల్ ఇండియా

హాండీక్రాఫ్ట్స్ బోర్డు



హస్తకళా వస్తువులు- అందానికి అనుపమమైనవి

DA—58/182

జయ యీ యేడు సంవత్సరాల్లో చాలడబ్బు సంపాదించింది. నటిగా మంచిపేరు వచ్చింది. ఆమె వ్యక్తిగత జీవితం మలిన ఛాయిష్టమైనా సొసైటీలో గొప్పవ్యక్తిగ పరిగణింప బడేది. ఎన్నడైనా సాయంత్రం చల్లగాలికి డాబామీద తిరుగుతున్నప్పుడూ, ఉదయంవేళ గార్డెన్‌లో కూర్చొని చదివేటప్పుడూ భర్తా. పాపా గుర్తొచ్చేవారు. మనస్సు వికలమై పోయేది, ఆలోచనలు మరలించు కొందుకు ప్రయత్నించేది.

ఆనాడు శనివారం. మరునాడు షూటింగు కోసం సిమ్లా వెళ్తున్నారు. జయ ఆ చిత్రంలో నాయిక. ఉదయం కాఫీ తీసుకొని గార్డెన్‌లో కూర్చుంది. నౌకరు మేగజైన్లు, పేపరుతెచ్చి టేబిల్‌మీద పెట్టాడు. యథాలాపంగా పేపరు తిరగవేస్తూంది. చిత్రలేఖనంలో మొదటి బహుమతి సందుకున్న పాపఫొటో స్కూలు వివరాలు పడ్డాయి. క్షణకాలం జయ స్తంభించి పోయింది. పాప అమాయకపు చూపులామెను కరగించి వేశాయి. దీక్షగా ఫొటోవైపు చూస్తున్న జయ "ఉత్తరం అమ్మగారూ"అన్న పిలుపుతో త్రుళ్ళి పడింది. ఆత్రుతగా విప్పింది.

"జయా !

ఈనాటి వరకు నీవు నేను వ్రాసిన ఉత్తరాలకు జవాబీయడం కాని, పాపను చూడటానికి రావడం గాని చేయలేదు. పాపపసి హృదయం నీకోసం యెంత ఆరాట పడుతూందో నేను మాటల్లో వ్యక్తీకరించ లేను. నీమీది బెంగతో చిక్కి శల్యామై పోయింది. ఈ సారైనా వస్తావని ఆశించే

నీ విమల.

"అమ్మా !

నాకు నిన్ను చూడాలని ఉంది. ఎప్పుడు వస్తావమ్మా ! పరీక్షలు బాగా వ్రాసాను, ఎన్నో ప్రైజులు కూడ వచ్చాయి. త్వరగా వచ్చి సెలవులకు తీసుకెళ్ళవూ? రావూ?—పాప. నీళ్ళునిండిన జయ కళ్ళకు అక్షరాలు మసగగా కన్పించాయి. చిట్టి పాప వేడికోలుతో ఆమె ప్రేమ సెల్లుబికింది. ఇన్నాళ్ళు గడిపిన మలిన ఛాయిష్టమైన జీవితాన్ని తట్టుకొని క్రుంగి పోయింది, స్నేహితురాలు ఆప్యాయంగా సహాయం చేయబోయినా తిరస్కరించినందుకు విచారించింది. ప్రకాశరావు నిర్మల ప్రేమానురాగాలు, బీదరికంలో కూడ లోటులేని మధురజీవితం కళ్ళముందు మెరిశాయి. చనిపోయిన భర్తకు, పాపకు డబ్బుకోసం చేసిన ద్రోహానికెంతో బాధపడింది. ఇక యీ జీవితానికి స్వస్తి చెప్పాలని, పాపను పెంచి పెద్ద చేయడమే తన జీవిత పరమావధి అని నిశ్చయించుకుంది. పాప కోసం ఆమె హృదయం ఆరాట పడసాగింది.

వెంటనే ప్రొడ్యూసర్‌కి ఫోను చేసింది, తను బయలుదేరి వెళ్ళి పోతున్నట్లు, తను చిత్రాలనుంచి విరమించు కుంటున్నట్లు చెప్పింది. అందరూ చాలా ఆందోళన చెందారు. వద్దని కోరారు. కాని ఆమె యెవరి సలహాను లక్ష్యపెట్టలేదు. ఆరాత్రే తన యీ యేడేళ్ళ జీవితానికి స్వస్తిచెప్పి తన జీవిత సర్వస్వం అయిన చిన్నారి పాపదగ్గరకు వెళ్ళిపోయింది.

రాత్రి యెనిమిది గంటలైంది. స్టేషనులో పాప, విమల ట్రెయిన్‌రాక కోసం యెదురు చూస్తున్నారు. అంతలోనే వచ్చింది. ఫస్టుక్లాసు కంపార్టుమెంటు గుమ్మంలో నించున్న జయ విమల కెదురుగా కనబడింది.

"అదిగో మీ అమ్మ ..." విమల అంటూ ఉండగానే "అమ్మా" అంటూ పరుగెత్తింది.

"పాపా !" రుద్ధకంఠంతో అంటూ పాపను దగ్గరకు తీసుకొని వాత్సల్యంతో నిమిరింది జయ.

దూరంగా నిలబడి చూస్తున్న విమల తృప్తిగా నిట్టూర్చింది,

నాటక ప్రకటన

శ్రీ పి. శివరామ్

సాయంకాలం మూడున్నర గంటలు. కాలువగడ్డు. ఒక వ్యక్తి నిలువబడిఉన్నాడు. అతని ప్రక్కనే ఒకయువతి సుమారు పాతిక సంవత్సరాల వయస్సుది అతని భుజముపైనున్న కండువా పట్టుకొని "అయయ్యో నన్ను అన్యాయం చేస్తారుటండీ నేనేం పాపం చేసానండీ. అగ్ని సాక్షిగా పెండ్లాడిన భార్యను నన్ను ఈలావదలి వెళ్ళుట న్యాయంకాదు. నాయందు ఎంతో ప్రేమగా మెలగేమీరు నాతో ఇరుగు పొరుగు అమ్మలక్కలు గట్టిగానేనా మాట్లాడటం ఇష్టపడని మీరు, ఇంతదయలేనివారై ఈ కారణంలేని అలుక ఏమిటండీ" అని ఆమె అతనినిపట్టుకొని కదలనీయక కంటి నీటితో అరుస్తూంది. ఇంతలో నల్గురు నాలుగు ప్రక్కలనుండి గుమి గూడుతారు. అందులో ఒక తలనెరిసిన పెద్దమనిషి. నాయనా ఏమిటీ తగాదా? "అబ్బా ఏమిటోనండీ ఈ మనిషెవరో ఏమో ఏమిటోనండి ముక్కు మొగం ఎరుగని నన్ను ఇలా నలుగురిలో పట్టుకొని నాభర్త అంటు అల్లరి చేస్తోంది. ఈమెవరో నాకు తెలియదు స్వామి నాకు పెళ్ళిలేదు పెటాకులులేదు కట్టుకున్నా లేకపోయినా ఈ పాపఖర్మ ఎక్కడిదీ. తెల్లారి ఎవరి ముఖం చూసానో భగవంతుడా!"

అయయ్యో. అదేమిటండీ అగ్నిసాక్షిగాపెళ్ళాడి లేదని బొంకుతున్నారా? అవ్వ! చూశారా అయ్యా ఈయన నాభర్తండి ఐదుఏళ్ళనుంచీ కాపరం చేస్తున్నాము. నేనెవర్నో తెలియనట్లు మాట్లాడుతున్నారు. అయ్యో, ఏమండీ ఈ పిల్లనైనా చూడండీ ఎలా బిక్కముఖం పెట్టుకొని చూస్తోందో. మృదువైన మీ హృదయం పాషాణం ఎలా అయిందండీ? మాట మీరుతున్నావు నీసంగతి నాకు తెలియదు తెలియదు ముమ్మాటికీ తెలియదు సిగ్గుండాలి పరాయి మగాడిని.


ఆ, ఆ, పరాయిమగాడా ఎంతమాట నావల్ల ఏదోషము లేకుండా ఏమిటీ అన్యాయం నాకేమిటండీ ఈ అగ్నిపరీక్ష? (బొంగురుపోయిన గొంతుతో) మీరు వదలి పోయేటట్లయితే నాగొంతు మీ చేతులతో నులిమి మరీపొండి ఈ పసిగుడ్డును మీ యిష్టమువచ్చినట్లు చేసుకోండి ఒక ముసలామె ఏమిటీరాద్ధాంతం ఏదో మొగుడు పెళ్ళాం అన్నాక పెరపొచ్చాలు రాకమానాయా? సర్దుకుపోవాలి. గాని అయినా అబ్బాయి ఆడదాన్ని ఇలాబాధ పెట్టడం భావ్యం కాదు అయినా ఆ, మీ ఇంటిపేరేమి నాయనా ఏం చేస్తుంటావు?

ఆ. చెప్పొచ్చారు లెద్దురు ఆవిడ మొఖం నేనెరుగను నామొఖం ఆమె ఎరుగదు మధ్య మీ ఈ సంబంధం కలపటమేమిటి? రోడ్డుమీద అడామొగా కనబడితే మొగుడూ పెళ్ళాం ఇంతేనా మీ ఉహా? "మళ్ళీ అదేమాటండీ, ఈ ఉంగరం మీరు పెళ్ళినాడు పెట్టినది కాదూ కాదటండీ దీనిలో రాయి మీ సెలలక్షన్ అని తీసుకొచ్చింది కాదండీ మనం ఆదర్శజీవితం గడపాలని భారతమాతకు వన్నెలు దిద్దాలని ఏమేమో అనేవారు జ్ఞాపకం లేదండీ? అందు చేతనే కదు నేనీఖద్దరు చీరెలు ధరించడం అని కళ్ళనీళ్ళు పెడుతుంది. ఛీ ఛీ అదేపాట నీవెవరివో తెలియదని చెప్తొంటే, అని అంటూండగానే నలుగురిలో ఒక పెద్ద మనిషి ఏమిటయ్యా గంటనుంచి చూస్తున్నాము. ఆమె అలోలక్ష్మణా అని మొత్తుకుంటోంటే ఏమిటా నీలుగుడు! మర్యాదగా తీసుకొని వెడతావా? లేకపోతే పంపించాలా? ఇద్దరు యువకులు అతనిపై చెయ్యి చేసుకోబోతారు.

నలుగురిలోంచి తప్పుకొని ఇద్దరు పకపకనవ్వుతూంటే చేరిన పెద్ద మనుష్యులు ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటుంటారు. యువతీ యువకుడు మరీ విరగబాటుగా నవ్వుతో వుంటారు.

అమ్మాయి తన హాండ్‌బాగ్‌లో నుంచి సువర్ణాక్షరాలు గల పత్రాలు ప్రజలకి పంచుతుంది. ఆ పత్రాల్లో నేటి రాత్రి బంగారువారి సత్రమున "రంగూన్‌రౌడి" అన్న నాటకము ప్రదర్శింప బడును. తప్పకచూడండి అని ఉంటుంది చదవటంవిని ముసలాయన "వీళ్ళ అసాధ్యంకూల ఇంత గందరగోళం ఈ నాటక ప్రకటన గురించా బాగు బాగు అని! అంటూండగానే ఆ నాటక పాత్రధారులు కిలకిల నవ్వుకుంటూ పోయారు.

ప్రథమ దశ



మెట్రిక్ పద్ధతి తూకాలు, కొలతలు అమలు జరిపే కార్యక్రమంలో ప్రథమ దశ 1958 అక్టోబరు 1 వ తేదీన ప్రారంభమయింది. వివిధ రాష్ట్రాల లోని ప్రత్యేకంగా ఎన్నుకోబడిన కొన్ని ప్రాంతాలలో మెట్రిక్ తూకాలు ఉపయోగించడం చట్టబద్ధ మయింది.

అదే విధంగా ప్రభుత్వ శాఖలలోనూ, నూలు వస్త్రాలు, ఇనుము, ఉక్కు, ఇంజనీరింగు, భారీ రసాయనిక పదార్థాలు, కాగితం, సిమెంటు, జనపనార మొదలైన పరిశ్రమలలో ప్రవేశపెట్టారు.

ఈ పద్ధతి క్రమంగా దశలవారీగా దేశ మంతటికీ వర్తింపబడుతుంది.

మెట్రిక్ పద్ధతి

అంతటా
ఒకే పద్ధతి-ఎంతో సులభమైనది

ప్రస్తుత తూకాలకు మెట్రిక్ పద్ధతిలో సమాన తూకా లేమిటో చూడండి

మెట్రిక్ తూకాలు : మారకపు పట్టీ

(కత్తిరించి వుంచుకోండి)

చటాకులు 5 తులాల చొ॥	గ్రాములు (సుమారుగా)
1	58
2	117
3	175
4	233
5	292
6	350
7	408
8	467
9	525
10	583
11	642
12	700
13	758
14	816
15	875

మణుగులు 40 శేర్ల చొ॥	కిలోగ్రాములు (సుమారుగా)
1	37
2	75
3	112
4	149
5	187
6	224
7	261
8	299
9	336
10	373
11	411
12	448
13	485
14	523
15	560
16	597
17	635
18	672
19	709
20	746

శేర్లు 80 తులాల చొ॥	కిలోగ్రాములు		గ్రాములు (10 గ్రాములకు సుమారుగా)
1	—	—	930
2	1	—	870
3	2	—	800
4	3	—	730
5	4	—	670
6	5	—	600
7	6	—	530
8	7	—	460
9	8	—	400
10	9	—	330
11	10	—	260
12	11	—	200
13	12	—	130
14	13	—	60
15	14	—	—
16	14	—	930
17	15	—	860
18	16	—	800
19	17	—	730
20	18	—	660
21	19	—	600
22	20	—	530
23	21	—	460
24	22	—	390
25	23	—	330
26	24	—	260
27	25	—	190
28	26	—	130
29	27	—	60
30	27	—	990
31	28	—	930
32	29	—	860
33	30	—	790
34	31	—	730
35	32	—	660
36	33	—	590
37	34	—	520
38	35	—	460
39	36	—	390

1 కిలోగ్రాం = 1,000 గ్రాములు

DA 58/247-TG

జీవన ప్రవాహంలో

మరపురాని మైలురాయి :

స్కూలు జీవితం

శ్రీమతి వై. సీతానాయుడమ్మ

నాకు తలపని తలంపుగా ఏదో ఒకటి రాయాలని మనస్సు పోతుంది. కాని నాకు తెలియని విషయాలమీదకు నా మనస్సు పోదు. మన జీవితంలో మనం అనుభవించినవి, స్వయంగా చూస్తున్న విషయాలగురించే ఆలోచన. ఆలోచనలు ఎక్కువే కాని కలం మాత్రం కాగితంమీదకు ఎక్కటానికి ఎంతోకాలం పడ్తుంది. ఈ మధ్యలో పాత ఆలోచనలు పోయి కొత్తవి తడ్తుంటాయి !

బయట ఎంతో చల్లగా వున్నది కొద్ది వర్షం పడి వెలిసింది. ప్రకృతి ఎంతో నిర్మలంగా కనిపిస్తున్నది. చెట్లు చూడ్డానికి షవర్ బాత్ తీసుకున్నాయా అన్నట్లుగా నిగ నిగలాడుతూ ప్రకృతికి మరింత సౌందర్యాన్నిస్తున్నాయి. ఆ ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ అలా చూస్తున్నాను. నా దృష్టి అంతా ఒక్కసారిగా ఎదురుగా కన్పిస్తున్న స్కూలు పిల్లలమీద పడింది. మాయింటికెదురే హైస్కూలు. ప్రక్కన కాన్వెంటు. ఇంకొకవైపున బేబి నర్సరి స్కూలు, ఇంకేమీ రోజూ కావల్సినంతమంది పిల్లల్ని చూడవచ్చు. మా పిల్లలిద్దరు యిప్పుడే బడికి వెళ్ళారు. ఇక మా చిన్నివాడు నాదగ్గరవుండి పాపాయిలవైపు వేలుపెట్టి చూపిస్తున్నాడు. పాపాయిలు చూడు చక్కగా ఆడుకుంటున్నారు. అదికాదన్నట్లుగా ఏడుస్తున్నాడు. ఏమిటి బాబూ ! ఏమిటి కావాలి? నీవు గూడా బడికి వెళ్ళి పాపాయిలతో ఆడుకుంటావా? లేదంటూ ఏడ్పు మరికాస్త పెద్దది చేసాడు ఎందుకు ఏడుస్తున్నాడా అని అటూ ఇటూ చూసేసరికి నా దృష్టికి ఒక్కసారిగా ఐస్ క్రీమ్ వాడు కనిపించాడు. మావాకిట్లోనే పిల్లలంతా ఐస్ క్రీమ్‌వాడిని చుట్టుముట్టి తలొక ఐస్ ఫ్రూట్ కొని తింటున్నారు. మా చిన్నివాడి దృష్టి దానిమీద పడిందని నాకప్పుడు తెలిసింది. ఓహో ! నీకు ఐస్ ఫ్రూట్ కావాలా? అది తింటే నీకు జబ్బుచేస్తుంది. తెలుసా ! డాక్టరు ఆంటీ కోపం చేస్తుంది. ఎందుకు తిన్నావని. ఎన్నో చెప్పాను. వింటేకదూ ! మా చిన్నివాడికోపం వర్ణించాలంటే కష్టం. వాడి సంగతి యింట్లో అందరికి తెలుసు. అందుకే మా చిన్ని విషయంలో అంతా జాగ్రత్తగా వుంటారు. ఇంకేమున్నది. నా వడిలోనుండి ఒక్కసారిగా క్రిందకి జారి అలిగి పండుకున్నాడు ఇంతలో మా నాయరు రావటం వాడిని క్రిందకు తీసుకెళ్ళటం కూడా జరిగింది. నా దృష్టి మాత్రం ఆ పిల్లలనుండి మరిలించలేనట్లుగా చూస్తూనే యున్నాను. ఇంతలో బెల్లు కొట్టేరు, అంతా ఐస్ క్రీమ్ వాడిని వదలి పరుగెడ్తున్నారు. ఎసంబ్లీకి అంతా హాజరైనారు. ప్రార్థన జరుగుతున్నది.

మరల చిన్న చిన్న తుప్పర పడుతున్నది. పిల్లలు ప్రార్థన మాట మర్చిపోయి తడిసిపోతున్నామని హడావుడి పడ్తున్నారు. పంతులమ్మ కేకలు ప్రార్థన ముగించమని. నాకిదంతా చూస్తుంటే నేను చదువుకునే రోజుల్లో కూడా యిలాంటి చిన్న సంఘటన ఒకసారి జరిగింది. మా కాన్వెంటు మదర్సుకు బాగా తెలుగు రాదు. ఒకరోజు మేమంతా ఎసంబ్లీలోనుండగా చిన్ని చిన్ని వానచినుకులు పడ్డాయి. మేమంతా గోల చేశాం. ఇక మా హెడ్మిస్ట్రెస్ వచ్చి ఎంత కోపంతో "చిన్న చిన్న వాన చినుకులు పడితే పెద్ద పెద్ద గోలచేస్తారు. పెద్ద పెద్ద బాంబులు పడితే మీరుఏమి చేస్తారంది." ఆమాట నాకు ఒక్కసారిగా గుర్తుకు వచ్చింది. ఇదేకాదు స్కూలు జీవితం ఎప్పటికీ మరపురాదు. ఆ జీవితం తిరిగి రమ్మంటే వస్తుందా !

సెలవులయిపోయాయి. స్కూలు తెరచారు. క్రొత్త బట్టలతోను క్రొత్త పిల్లలతోను, ప్రతి స్కూలు కళ కళలాడుతున్నది. పిల్లలు వున్నదానిలోనే ఎవరికి తగినట్లు వాళ్ళు నీటుగా అలంకరించుకున్నారు. రకరకాల పిల్లలు. రంగు రంగు బట్టలు క్రొత్త క్రొత్త ఫ్యాషన్లు అంతా క్రొత్తే. వాళ్ళకది క్రొత్త జీవితం. ఆజీవితంలో వాళ్ళకంతా ఆనందమే. చదువుకున్నంత

సేపు చదువుకోవటం, ఆడుకోవటం, పాడుకోవటం చూస్తుంటే ఎంతో ముచ్చటగా వుంటుంది.

చిన్న చిన్న పాపాయిలు ఒక బుజాన సంచి తగిలించి ఒక చేత్తో టిఫెన్ క్యారేజీ పట్టుకొని నడుస్తుంటే వాళ్ళవైపే చూడాలనిపిస్తుంది. పెద్ద పిల్లలంతా రెండు జెడలు వేసి రిబ్బన్లు కట్టి తలనిండా పువ్వులు పెట్టి పుస్తకాల సంచి సైకిలుకి తగిలించి వయ్యారంగా సైకిల్ తొక్కుతూ రావటం చూస్తుంటే ఆనందం కల్గించక మానదు

బెల్లు కొట్టగానే పిల్లలంతా వాళ్ళ వాళ్ళ స్నేహితులతో కలసి టిఫెన్ క్యారేజీలు పుచ్చుకొని చెట్ల క్రింద చేరి జరిగిన విషయాలన్నీ చర్చిస్తూ భోజనాలు మొదలెడ్తారు. ఇక అలాంటి ఆనందం మనం యింట్లో టేబుల్ దగ్గర కూర్చుని భోంచేస్తే వస్తుందా! భోజనాలంటే జ్ఞాపకానికి వచ్చింది. నాకు మన ఆంధ్రమహిళా సభలో గూడా చదువుకునే అవకాశం కల్గింది. కాని ఉండటం మాత్రం కాన్వెంటు హాస్టల్లో. రోజూ నాకు క్యారేజి పంపించేవాళ్ళు. ఇష్టమున్నా లేకున్నా తిటుండేదాన్ని. నా స్నేహితులిదంతా చూశారు. ఒక స్నేహితురాలు ఒకరోజు ఎదో ఒకటి తీసుకువచ్చి నీకోసరం ప్రత్యేకంగా తీసుకువచ్చాం తింటేకాని వీలుకాదనేవారు. ఇక నాకు తప్పనిసరిగా తినాల్సి వచ్చేది. నా క్యారేజిమాత్రం ఆయా తీసుకువెళ్ళి తింటుండేది. అల్లాంటి స్నేహితులు మరల దొరుకుతారా! ఆ జీవితంలో వున్నవాళ్ళని, లేనివాళ్ళని తారతమ్యం కనిపించదు. వాళ్ళు కోరేదల్లా రెండే. ప్రేమించటం. ఆనందించటం. అలాంటి ఆనందాన్ని ఎప్పుడూ ఆనందించలేమనే నావూహా. ముసలితనంలో యవ్వనాన్ని కోరుతున్నట్లుగా నాకిప్పటికీ తనివి తీరనట్లుగా వుంటుంది. కాలేజీలో చేరాలి. పిల్లలతో పిల్లనుగా ఆడుకోవాలనిపిస్తుంది. ఎలాకుదుర్తుంది? ఒకవైపు భర్త, ఒకవైపు పిల్లలు. సంసారం వదలి చదవటానకి. అలా చదివేవారు కూడా లేకపోలేదు. అది వాళ్ళ అదృష్టమనే చెప్పాలి. కాని ఒక్క విషయం మాత్రం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది నాకు. కొందరికి బడికి వెళ్ళాలన్నా, ఉపాధ్యాయులన్నా భయం. ఎవరోదాకా ఎందుకు మావాడికే భయం. ఉదయం లేస్తూనే అమ్మా ఈరోజు బడి వుందా! అని మొదటి ప్రశ్న. ఉన్నదంటే మరల కన్నుమూసి నిద్ర పోతాడు. లేదంటే చక్కగా నిద్ర మేల్కొంటాడు. పోనీ వాడికి చిన్నవయసు అనుకుందాం. ఇక పెద్ద వాళ్ళే అలా చేస్తుంటారండే ఆశ్చర్యం కల్గించక మానదు. ఎందుకు భయం? పాఠాలు చదవటంలేదు, కోప్పడ్తాము. అంతేకదూ. పోనీ చదువుకొని వెళ్ళ గూడదూ. చెప్పిన విషయాలు చేస్తుంటే యింట్లో అమ్మకు ఎంత ఆనందంగా వుంటుందో అలాగే బడిలో మాష్టర్సుకూ ఆనందంగావుంటుంది.

స్కూలు ఒక సమిష్టి కుటుంబంలాంటిది విద్యార్థులు బిడ్డలులాంటివాళ్ళు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులు. చీకూ చింతా లేని సుఖజీవితం గడపాలంటే స్కూలుజీవితమే. మన సంసార జీవితంగూడా అలా సమిష్ఠి కుటుంబంలాగా వుంటే ఎంతబాగుండును. ఎక్కడో రష్యాలో అలాంటి ఆనందాలు వున్నాయని మనం తలుచుకొని మురిసిపోవటమే గాని మనకు మనమే మిగులుతున్నాం,

బిడ్డలు చదువుకొని యింటికివస్తారని టిఫిను వేడిగా పెట్టి ఎదురుచూస్తుంటుంది. మాటలో మాట, అదిగో మా పిల్లలు గేటుదగ్గరనుండే కేకలు అమ్మా లే అంటూ!

ఆంధ్ర మహిళా సభ —

ఆవరణలో ప్రతీ రోజూ బీద— బాల బాలికలకు జరుగుచున్న పాల పంపకం-

అక్టోబరు —నెలలో 4972 మందికి పాలుపంచబడెను

ఈ పాల పంపకం ప్రతీ రోజు ఉదయం 7 గంటలకు జరుగుచున్నది.

శని, ఆదివారములు నూకల గంజి కూడా పోయుట జరుగుచున్నది.

శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ హితవు

సాంఘిక సమాచార లేఖ

ఈమధ్య వికలాంగుల జాతీయ విద్యా సలహా సంఘం ముస్సోరిలో సమావేశమై, వికలాంగుల సహాయార్థం తృతీయ పంచవర్ష ప్రణాళికలో చేర్చదగు జాతీయప్రణాళికను గురించి కొన్ని సూచనలు చేసింది.

వికలాంగులలో ముఖ్యమైనతరగతులవారికి నమూనా శిక్షణ సంస్థను నెలకొల్పాలనీ, ఆ సంస్థలో పని చేసే సిబ్బందికి శిక్షణ సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

ఒక సమగ్రమైన శ్రవణశాస్త్ర కేంద్రాన్ని స్థాపించాలన్నది యీ జాతీయ ప్రణాళికలో ముఖ్యవిశేషం. చెవిటివారి చికిత్సకూ. వాగ్విషయిక చికిత్సకు యిందులో సౌకర్యాలుంటాయి. తృతీయ ప్రణాళిక పూర్తియ్యేనాటికి ప్రతీ రాష్ట్రంలోనూ చెవిటివారికీ. గ్రుడ్డి వారికి, తదితర వికలాంగులకూ కనీసం ఒక నమూనా పాఠశాలను నెలకొల్పాలని యీ సంస్థ సిఫార్సు చేసింది. అదే కాలంలో వికలాంగుల కోసం నెలకొల్పుతున్న వివిధ సంస్థలకు అవసరమయ్యే అధ్యాపకులకు శిక్షణ నిచ్చేందుకుగాను కనీసం ఆరు సంస్థలనైనా స్థాపించాలని యీ సంస్థ సిఫార్సు చేసింది.

ఆయా రాష్ట్ర ప్రభుత్వాల వద్దనుంచి లైసెన్సులు పొందనిదే వికలాంగుల కోసం కొత్తగా సంస్థలని నెలకొల్పరాదని ఆదేశిస్తూ భారత ప్రభుత్వం శాసనం చేయాలనికూడా యీ సంస్థ సూచించింది. దొంగ సంస్థల వ్యవస్థాపకులు వికలాంగులను మోసగించకుండా నివారించేందుకు యీ శాసనం తోడ్పడుతుంది.

వికలాంగుల జనాభా యెక్కువగా గల ప్రాంతాలను నిర్ణయించేందుకు గాను, యిదివరకే సాంఘిక, ఆర్థిక సర్వేలు జరిగిన ప్రాంతాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ప్రణాళికా సమితి సేకరించాలని కూడా యీ సంస్థ సూచించింది. భారతజాతీయ నమూనా సర్వేసంస్థ సదా తదితర సంస్థలూ యిది వరకే, ఆర్థిక సర్వేలు జరిగిన ప్రాంతాలలో యితోధికంగా సర్వే జరిపించాలని కూడా వారు సిఫార్సు చేశారు. అలా చేస్తే వికలాంగుల సాంఘిక, ఆర్థికావసరాలను నిర్ణయించడం వీలవుతుంది.

సంక్షేమ విస్తరణ ప్రాజెక్టులు అమలు జరుగుతున్న దాదాపు ౩౦ వేల గ్రామాలలో వికలాంగుల సర్వేలను జరిపించడానికి కేంద్ర సాంఘిక సంక్షేమ మండలిని కోరాలని కూడా యీ సంస్థ సూచించింది. వచ్చేసారి జనాభా లెక్కలలో వికలాంగుల సంఖ్యను కూడా చేర్చే అవకాశాన్ని పరిశీలించ వలసిందని దేశీయాంగ మంత్రిత్వశాఖను కోరాలని కూడా సూచించారు.

శిక్షణ పొందిన వికలాంగులకు ఉపాధి చూపేందుకు ఒక వ్యవస్థను స్థాపించ వలసిన అవశ్యకతనుకూడా యీ సంస్థ ప్రత్యేకంగా పేర్కొన్నది. ఇందుకోసం భారత ప్రభుత్వం రూపొందించిన పథకాన్ని యీ సంస్థ ఆమోదించి, వీలైనంత త్వరలో ఆ పథకాన్ని అమలు జరపాలనికూడా సూచించింది.

ప్రభుత్వం ఒక తీర్మానం చేసి వికలాంగుల కోసం ౧౯౫౫ సెప్టెంబరులో జాతీయ విద్యా సలహా సంస్థ యేర్పడింది. మానసికంగానూ వైకల్యం పొందిన వారికి సంబంధించిన అన్ని సమస్యలను గురించి భారత ప్రభుత్వానికి సలహా నివ్వడం వారికిచదువుచెప్పి, తిరిగి ఉపాధి కల్పించేందుకు కొత్తపథకాలు రూపొందించడం—యివే యీ సంస్థ ప్రధాన లక్ష్యాలు కేంద్ర విద్యామంత్రిత్వశాఖ యిలాంటి పథకాలను ద్వితీయప్రణాళికలో చేర్చింది.కొంత వరకూ అమలు జరపడం అప్పుడే ప్రారంభమయింది.

౧౯౫౪, ౫౪ వ సంవత్సరాల మధ్య కేంద్ర మంత్రిత్వశాఖ విద్యాసంస్థల వినోద కార్యక్రమం పథకం క్రింద పాఠశాలకూ, కళాశాలకూ. విశ్వ విద్యాలయాలకూ, ౫౦ లక్షల రూ. ల సొమ్ము యిచ్చింది. వినోద మందిరాలూ

ఈత కొలనులూ బహిరంగ స్థలాలు. ఆట మైదానాలూ, వ్యాయామ కేంద్రాలూ మొదలైన ౭౫౦ పథకాలకు యీ సొమ్ము యిచ్చారు.

భారత దేశంలో చాలా పాఠశాలలకూ, కళాశాలలకూ యిలాంటి సౌకర్యాలు లేవు. ఈ సౌకర్యాల వల్ల విద్యార్థుల శారీరకారోగ్యమే గాక. వారి నైతికశక్తీ, క్రమ శిక్షణాభావమూ పెంపొందుతాయి.

విద్యార్థులూ, సిబ్బందీ యిచ్చే శ్రమదానంతో యీ సౌకర్యాలను కల్పించవలసి ఉంది. అదనంగా సొమ్ము లభిస్తే, యీ పథకాన్ని చాలా వరకూ విస్తృతపరుస్తారు. చాలా సంస్థలు యీ పథకం వల్ల లాభం పొందుతాయి.

ఈ పథకానికి విద్యార్థులూ, సిబ్బందీ కూడా ఎలాగైన తోడ్పడాలనే షరతుపై భారత ప్రభుత్వం ౧౯౬౩-౬౪ వ సంవత్సరంలో యీ పథకాన్ని పారంభించి విద్యా సంస్థలకు గ్రాంటులిస్తోంది. స్వచ్ఛందంగా పనిచేసే వారి కయ్యే ఖర్చును మినహాయించి, మిగిలిన మొత్తం ఖర్చులో నూరింట ౭౫ వంతుల భాగాన్ని యీ సంస్థే భరించాలి.

♦ ♦ ♦

మారిన నేటి పరిస్థితులలో స్త్రీలకు తమ బాధ్యతలను గురించి తెలియ జెప్పడం, వారిలో విశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంపొందించడం— యిదే అకాశవాణి ప్రధాన లక్ష్యమని యీ మధ్య నూఢిల్లీలో ఆకాశవాణి స్త్రీల. బాలల కార్యక్రమ నిర్మాతల, దర్శకుల సమావేశంలో ప్రసంగిస్తూ కేంద్రసాంఘిక సంక్షేమ మండలి అధ్యక్షులు శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ అన్నారు.

సాంఘికంగానూ, ఆర్థికంగానూ, శాసన రీత్యానూ, స్త్రీజన సంక్షేమానికీ, పురోభివృద్ధికి యిదివరకే అనేక విధాలుగా జరిగిన కృషిని ప్రచారం చేసే ఉద్దేశంలో ఆకాశవాణి కార్యక్రమాలను రూపొందించాలి. ఈ సందర్భంలో వివిధ సాంఘిక సంక్షేమ ఆర్థిక సంక్షేమ పథాకాలకు ప్రాముఖ్య మివ్వాలి. తమ పరిస్థితిని మెరుగు పరిచేందుకు యిప్పుడు జరుగుతున్న కార్యక్రమాలను వారికి తెలియజేయాలి.

అభివృద్ధి కార్యక్రమాలకు సొమ్మును సమకూర్చే చిన్నమొత్తాల పొదుపు ఉద్యమాన్ని ప్రోత్సహించేందుకు కూడా రేడియో కార్యక్రమాలను వినియోగించుకోవాలి, తమ అభివృద్ధికోసం జరుగుతున్న కృషిలో వారు చైతన్యవంతంగా పాల్గొనేటట్టు చేయాలి. — అన్నారామె.

స్త్రీల సాంఘికఆర్థిక, ప్రతిపత్తిని పెంపొందించేందుకూ, సంఘ విద్రోహక శక్తుల నుండి వారిని రక్షించేందుకూ, స్వాతంత్ర్యసిద్ధి అనంతరం అనేక సాంఘిక శాసనాలు చేశారని శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ గుర్తుకుతెస్తూ, స్త్రీలకు అలాంటి చట్టాలు వున్న విషయమే తెలియదనీ. అందువల్ల వారు వాటివల్ల ప్రయోజనాలు పొందడం లేదనీ అన్నారు, తమ హక్కులను గురించీ, వారి క్రొత్త ప్రతిపత్తిని గురించి స్త్రీలకు తెలియజెప్పడంలో ఆకాశవాణి ప్రముఖ పాత్ర వహించాలని చెప్పారు.

సాంఘిక సంక్షేమ కార్యక్రమాలతోబాటూ ఆర్థిక సంక్షేమ కార్యక్రమాలను అమలు జరపాలన్నది అందరూ అంగీకరించిన విషయమే. అందువల్ల సంక్షేమ కార్యక్రమాలకు సాంఘిక ఆర్థిక ప్రాముఖ్యం వచ్చింది. సంక్షేమ కార్యక్రమాల ధర్మమాని తాము సంపాదించిన నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకుని నాలుగు డబ్బులు చేసుకునేందుకు అవకాశాలూ, సౌకర్యాలూ, కల్పించవలసిందని యీ మధ్య గ్రామీణ మహిళలు యెక్కువగా కోరుతున్నారు.

పాలక రంగంలో క్రమంగా ప్రజాస్వామ్య వికేంద్రీకరణ జరుగుతున్న యింత వరకు మన ప్రభుత్వ సహాయంతోనూ, యితర సహాయంతోనూ అమలు జరుగుతున్న కార్యక్రమాలను తామే నిర్వహించేందుకు స్థానిక మహిళలతో బలమైన సంస్థలను యేర్పాటు చేయడం అవసరమయింది. ఇతర సంస్థలపై ఆధారపడే భావం పోయి, సహాయభావం నెలకొనాలి.

★★★



యదార్థ వాది లోక విరోధి

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

జీవితములో కొన్ని ఆదర్శాలు పెట్టుకుని జీవించే వారు కొందరు. మరి కొందరు గాలి పటములా ఎగిరేవారు. కాని గాలి ఎటొస్తే అటు జోరుగా ఎగురుతుంది గాలిపటము. ఆది ఎంత ఎత్తుకుపోతే అంత ఆనందము కలిగిస్తుంది ఎగరేసేవారికి. అట్లాగే గాలి పటములా ఎగిరేవారు వారి అనునయాలకు వారి యాత్రా ఔన్నత్యములను బట్టి ఆనందము కలుగచేస్తూంటారు. ఈ పఋషారులో దారముతేగి గాలి పటము మటుమాయమైతే ఎగరేసేవారు మనప్రాప్తమింతేనని సరిపెట్టు కుంటారు. ఎగిరిపడ్డ గాలిపటము చెట్లకు, ముళ్ళకు, కొమల్మకు తగిలి చినిగి ముక్కలు ముక్కలై 'నాఖర్మ' యని విలపిస్తూ అంతిమయాత్ర చేస్తుంది. ఎంతటి చిత్రమైన మన వేదాంతము! పాపులకు పుణ్యాత్ములకు సమాన భావముతో ఆదరించి ఓదార్చి పోషించుతుంది. ఔరా భారతభూమి ఎట్టి వేదాంత కుసుమాన్ని భారతీయుల కిచ్చింది. దాని సౌరభ్య గ్రహణముతో జీవితమార్గాన్ని, జీవితముక్తిని గాంచుచున్నారు. క్వినైను మాత్రవలెవుండే మాత్రను తియ్యగా చేయగల మన వేదాంత కోవిదులు అభివందనార్హులే కదా?

పోతేనైతికంగా అవలోకించుదాము. ఇవిధర్మాలు అవి అధర్మాలు అని పెద్దలు చెప్పారు. వారు చూసొచ్చి చెప్పలేదనుకోండి. మనము చూసొచ్చి ఋజువు చేసుకోబోయేది లేదు. మనకు దేవుడిచ్చిన ఆలోచనా శక్తితో వివేకజ్ఞానముతో మంచి చెడ్డలమధ్య ధర్మఅధర్మాలమధ్య ఒకగీటు వేయగలుగు తున్నాము కాని అది స్వవిషయ మయేటప్పటికి హృదయానికి కొంచెం రేజీకటి కమ్ముకు వస్తుంది. కారణము మనమెప్పుడు కష్టమైనది విసర్జించి సులభమైనది గ్రహిస్తాము, అంతేగాదు, వెంటనే సుఖాన్నిచ్చేది వాంఛించుతాము. రాజకీయాల్లో కమ్యూనిజమునీ అందుకే ఆశిస్తారు. విద్యార్థులు పరీక్షలలో అందుకే కాపీ కొట్టారు. దొంగలందుకే ఇతరులు కష్టపడి సంపాదించిన ధనాన్ని హరిస్తారు. మరి కొందరు అందుకే బొంకుతారు. అందుకే రంకుతనము చేస్తారు. మరందుకే జూదమాడుతారు. ఇన్నిమాటలేల, సప్తవ్యసనాల్లో అందుకే తగుల్కొంటారు.

ఇలా పాపములోకి పడి అధోగతి పాలుకాకుండా వుండాలంటే మానవ మాత్రులు స్త్రీ పురుష ఉభయులు కేవలము వేదాంతాన్ని ఆశ్రయించితే లాభములేదు. నైతిక బలములేని వేదాంతము చాలా ప్రమాదమైంది. విషముబూసిన కత్తివంటిది. వేదాంతపు కత్తిని నైతికపు పదును పెట్టి వాడితేనే అది శుభప్రదమైన ఫలితముల నివ్వగలదు.

ఎన్ని కష్టాలుగాని. ఎన్ని దుర్మార్గాలు గాని. ఎన్ని కుటిల తంత్రములు గాని ధర్మముతో సర్వము ప్రతిష్ఠింపబడును, ఇది ఈ నాడు కళ్ళు దెరచిన యువతీ యువకులకు తెలిసే సత్యముకాదు. జీవితము కరుకు రంపము మరలో నలిగి కష్టసుఖాలు అనుభవించి జీవి

తాన్ని కాచి వడపోసిన వారికి తెలిసిన సాధారణ సత్యమే.

కాని ఈ పాపపు కలియుగములో యదార్థవాద లోకవిరోధి.

ఈ విషయము మనము పెద్దగా ఆలోచించ నవసరము లేదు. వుదాహరణకు సామాన్యమైన దానము విషయము ఆలోచిద్దాము. పురుషార్థమన్నారు, సర్వ పాపములు నశించునన్నారు. దానము ధర్మము నెరుగని విత్తము దొంగల పరమన్నాడు భర్తృహరి. దాన ధర్మములేక దాచిదాచిన ధనము వెళ్ళిపోయెడినాడు వెంట తీసికొనిపోడు. తేనెటీగ లిచ్చినపగిది దొంగల కియ్యకుండా దానము చెయ్యమన్నాడు. నారశింహ శతకవేత్త. ఈ సంగతులన్నీ మనకు తెలిసినవే. చాలా సార్లు విన్నాము, అయినా మనము ఎందుకనోగాని దానము చేసేదానికన్నా దానము పుచ్చుకునే దాంట్లోనే ఎక్కువ ఆశక్తి చూపించగలుగుతున్నాము.

నిజంగా ఆలోచిస్తే మనకు దానము ఇవ్వగలశక్తి లేదనుకోండి, అంత మాత్రముచేత దానము పుచ్చుకోవలసిన అవసరము ఎందుకు కలుగుచున్నదో మన మిప్పుడు సరిగా చెప్పలేము. దానము ఇవ్వటము ఎంత పుణ్యమో పుచ్చుకోటము అంత పాపమన్నారు పెద్దలు, ఎవరో ఫూల్సే అనుకోండి. అయినా మనకి ఎవరు దానము యిస్తున్నారు, మనము ఎవరి దగ్గిర పుచ్చుకుంటున్నాము. ఎవరేనా స్నేహితులు ఏదైనా పంపిస్తే అది ప్రెజెంటాయె. అది పుచ్చుకోకపోతే వారి మనస్సుకు చాలా కష్టము కలుగుతుంది. అందుకని పుచ్చుకుంటాము. అదీగాక అది దానము కాదు, ఎవరో శత్రువులు, చూడలేనివారు దాన్ని లంచమని కూడా అనవచ్చు. కాని అది దానముకాదు. లంచమూ కాదు. చక్కని ప్రెజెంటు. పవిత్రమైన స్నేహబంధనకు చిహ్నము. అయినా ఆనాడు భాగవతములో

"ఆదిన్ శ్రీసతి కొప్పుపై.......

అనలేదూ? ఇచ్చేవాళ్ళు పుచ్చుకునే వాళ్ళ స్టేటస్‌నుబట్టి ఈ దానము మంచి చెడ్డలు నిర్ణయించాలి. ఘరానాగా ఫలానిగారు రోడ్డుమీద లిఫ్టు (అంటే కారులో ఎక్కించుకు పోవటము)యిస్తే అది దానమా? ఆ ఘరానాకు కారుండి లిఫ్టులిస్తే తప్పేముంది. వెళ్ళితే అనలేదు. సమయము విలువ తెలిసిన వారెవరూ నిరాకరించరు. రేపు నేను కారు కొనుక్కున్నప్పుడు నేను మాత్రము దోవను బోయే వాళ్ళందరికీ లిఫ్టు ఇవ్వనూ !

"పరశయ్యాసనోద్యాన గృహాయనానివర్థమేత్" ఇతరుల పక్కలు ఆసనములు, వాహనములు, గృహములు స్వీకరించరు, ఎవరు? స్వేచ్ఛా ప్రియులు అది గదిగో అక్కడేవుంది పొరపాటు. స్వేచ్ఛా ప్రియులు ఇతరుల సొమ్మును ఆసించక పోవచ్చును కాని అసలు స్వేచ్ఛ అంటూ ఒకటి వుందా? స్వేచ్ఛాప్రియులంటూ కొందరు వున్నారా అదంతా ఒక బూటకనాటకమే? గాని సర్వ స్వతంత్రులంటూ మానవులెవరూ లేరు.

అట్లాగే సత్యముచెప్పుట, ధర్మము తప్పకుండుట వగైరాలు నేడు నైతిక శాస్త్రగ్రంథములలో వుండదగినవేగాని జీవితములో వుపయోగపడే సిద్ధాంతాలు మాత్రము కావు. అవి ఏనాడు, ఏ కాలములోను వుపయోగపడ లేదు. అందుచేతనేగా సోక్రటీసుకు గ్రీసులో ఆ గతి పట్టింది.

పోతే హరిశ్చంద్ర చంద్రమతులకు నలదమయంతులకు, ద్రౌపదీపాండవులకు, సీతారాములకు కలిగిన ధర్మవిజయము సంగతేమిటంటారేమో —ఆ కథలన్నీ పుక్కిటి పురాణాలు కట్టుకథలు కదటండీ. నాలాగేదో "హాస్య కథగా వ్రాశారు ఎవరో పనిలేని కలముగాళ్ళు.

యదార్థవాది లోకవిరోధవటము తప్పదేమోనని భయపడుతూ ఇంతటితో 'హాస్య'లో యదార్థవాది సంతాపములు ముగించి ఈసారినుండి నేను నేర్చిన విద్యలోని లోపాలను దోషాలను మీకు చూపించ గలను.



ఉక్కు మనిషి

సర్దార్ పటేల్

నేటికి అనగా అక్టోబరు ౩౦వ తేదినాటికి సరిగా ౮౩ ఏళ్ల క్రిందట, గుజరాత్‌లో కైరా జిల్లాలో ఖేదా తాలూకాలోని ఒక కుగ్రామంలో సర్దార్ వల్లభాయ్ పటేలు జన్మించారు. ఆయన మరణించి యిప్పటికింకా ౮ ఏళ్లు కాలేదు. ఈ ఎనిమిదేళ్ల కాలంలోను ఎన్నో మహత్తర సంఘటనలు జరిగాయి. భారత జాతికి ఈ మహాపురుషుడు చేసిన సేవను సవిమర్శగా సింహావలోకనం చేసుకోడానికీ, ఆయన భారతజాతి హృదయానికి ఎలా అంతసన్నిహితుడు కాగలిగాడో, ఆయనలోని విశిష్టమైన లక్షణాలేమిటో అవగాహన చేసుకోడానికీ, మనకి స్వల్ప వ్యవధిలో చాలా అవకాశాలు లభించాయి. స్వతంత్ర భారత చరిత్రను ఎవరైనా పక్షపాత రహితంగా వాస్తవిక దృష్టితో రచించినట్లయితే ఆ చరిత్రలో స్వర్గీయ వల్లభాయ్‌పటేలుకు అనితర సాధ్యమైన ఉన్నత స్థానం లభించగలదనడంలో సందేహంలేదు. ఎన్నో ఒడుదుడుకులతో కూడిన సర్దార్ వల్లభాయ్‌పటేలు సుదీర్ఘ జీవిత చరిత్రను ఆసాంతం మననం చేసుకోవడం ఇప్పుడు అప్రస్తుతం. ఆయన ఏ తరానికి చెందినవాడో ఆ తరం వారికి, ఆ చరిత్రను వివరించడం అనవసరంకూడా. సర్వశక్తిమంతుడైన ఈ మహనీయుని శబల స్వభావంలోని కొన్ని ముఖ్య లక్షణాలను మాత్రమే నా శ్రోతలకు వివరించడానికి ప్రయత్నిస్తాను.

సర్దార్ వల్లభాయ్‌పటేలు వంశం కాకలుతీరిన లోకజ్ఞానానికీ వ్యవహార వేతృత్వానికీ పేరు పొందింది. పటేలులు ప్రధానంగా కర్షకులు. భూమాత ఒడిలో పుట్టి పెరిగిన వారు. పూనిక, చొరవవారికి పుట్టుకలో పుట్టిన లక్షణాలు. అవి వారి నెత్తురులో జీర్ణించిపోయాయి. వారు ఏ ప్రాంతానికి వెళ్లినా, అది స్వదేశమేగానీయండి, పరదేశమే గానీయండి. వారి ఈ సహజ లక్షణాలు అందర్ని ఆకట్టేవి. వారు వ్యాపారస్థులుగాను పారిశ్రామికులుగాను కూడా రాణకెక్కారు. పటేలుల వంగసంలోని ఈ విసర్గ లక్షణాలన్నీ కీ. శే. సర్దార్ పటేలులో మూర్తిభవించి కరుడు గట్టాయి. గడచిన నాలుగు దశాబ్దాలలో నేను ఎరిగిన రాజకీయ వేత్తల అందరిలోకి, ఊహా జగత్తులో కొట్టుకు పోకుండా వాస్తవాలపై కాలూని నిల్చిన కార్యవాది సర్దార్ ఒక్కడే. ఏదైనా ఒక కార్యం సాధించవలసి వచ్చినప్పుడు ఏమార్గం అవలంభిస్తే తప్పక జయం కల్గుతుందో, ఇట్టే పసిగట్టగల ఇంద్రియాతీతమైన ఇంగిత జ్ఞానం ఏదో అయనలో ఉండేది. ఏ రాజకీయ వాదాన్ని గానీ. ఆర్థిక వాదాన్నిగానీ ఆయన అవలంబించలేదు. ఆయా రాజకీయఆర్థిక వాదాల అపుగాములను గురించి నిరర్థకమైన వాద వివాదంలో తగుల్కొని తలలు బద్దలు కొట్టుకునే, మేధకులైన రాజకీయ వేత్తలకు ఈయనకు తూర్పు పడమరలకున్నంత వ్యత్యాసం ఉంది. ఇష్టాగోష్ఠి ప్రసంగాలలో సర్దార్ ఇట్టి సిద్ధాంతవాదులను గూర్చి గమ్మత్తుగా అపహాస్యంచేస్తూ ఉండేవారు. తనను వట్టి మొరటురైతు అని ఎవరైనా అన్నా, అయన ఏమాత్రం నొచ్చుకునేవాడుకాదు.

ఒకసారి సర్దార్ పటేలు జయంతి సందర్భంలో సరోజినీనాయుడు ప్రసంగిస్తూ, సర్దారుకు ఒకే ఒక "కల్చర్" తెలుసుననీ అది "అగ్రికల్చర్" అనీ, ఛలోక్తి విసిరింది. ఈ హాస్యంవిని సర్దార్ కడుపుబ్బ నవ్వాడు. ఆయన తన ప్రపంచ జ్ఞానంతో ఇతరులకు కొరకరాని కొయ్యలుగా పరిణమించిన చిక్కు సమస్యలను కూడా ఇట్టే తేల్చి వేసేవాడు. ఇందుకు ౧౯౨౮లో జరిగిన బర్డోలీ సత్యాగ్రమే నిదర్శనం. అరోజుల్లో ఈదేశంలో బ్రిటిష్ ప్రభుత్వం చాలా బలీయంగా ఉండేది. ప్రజ్ఞావంతులమనుకునే రాజకీయ వేత్తలనేక మంది సర్దార్‌నూ అయన ఉద్యమాన్నీ ఎగతాళిచేసి అది తప్పక విఫలం అవుతుందని గంభీరంగా జోస్యం చెప్పారు. అయితే సర్దారు తన చేతులో ఉన్న తురుపు ముక్కను తరుణం కనిపెట్టి అదనులో ప్రయోగించడంతో అయన విజయం సాధించగల్గారు. ఫలితంగా అయనకీర్తి అజరామరమైది.

బార్డోలీలో సర్దారుగా వ్యవహరించి, జయం సాధించినందువల్లనే ఆయనకు సర్దార్ అని సార్థక నామధేయం కల్గింది. సామాన్య రైతుకు తన పొలం అంటే అమితమైన ప్రేమ. ఏమైనాసరే తన భూమికి అంటిపెట్టుకుని 'ఉండడమే అతని లక్షణం. రైతుకు పొలాన్ని వదులుకోడం అంటే ప్రాణాలను వదులుకోడంతో సమానం. ఈ కీలకాన్ని కనిపెట్టడంవల్లనే సర్దార్ ఈ వుద్యమంలో జయం సాధించగల్గారు. రైతుల చేతులలో కావలసినంత బలం ఉందని ఆయనకు తెలుసు. ఈ బలమే ఈ ఉద్యమ నిర్వహణకు తోడ్పడింది. మహాత్మా గాంధీ సత్యాగ్రహోద్యమాలలోకెల్ల బార్డోలీ సత్యాగ్రహమే ఎక్కువ జయప్రద అయింది. ఈ వుద్యమం తర్వాత జరిగిన ఉద్యమాల పరంపరకు నాంద్రిప్రాయమైన భారతదేశానికి అంతిమంగా స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టింది. బార్డోలీ సత్యాగ్రహ సందర్భంలో తెలుసుకున్న కొన్ని కిటుకులు తర్వాత ఉద్యమాలకు ఎంతో ఉపకరించాయి. ఉద్యమాలు జయప్రదం కావాలంటే నాయకులు పట్టణాలమీదనుంచి గ్రామాలమీదికి దృష్టి మర్లించాలని తెలిసివచ్చింది. ౧౯౩౧లో కరాచీ సమావేశంలో సర్దార్ భారత జాతీయ కాంగ్రెసుకు ఆధ్యక్షుడుగా ఎన్నిక అయారు. ఆతర్వాత రెండు శతాబ్దాలపాటు ఆయన అగ్రశ్రేణి రాజకీయ వేత్తలలో ఒకరుగా లెక్కకెక్కారు. భారత స్వాతంత్ర నిర్మాతలని చెప్పదగిన కొద్దిమందిలో ఆయన ఒకరు.

శ్రీ పటేలులో ఉన్న మరో లక్షణమేమిటంటే ఆయన ముక్తసరిగా తూచినట్లు, కుండ బద్దలుగొట్టినట్లు మాట్లాడుతారు. ఆయన ప్రసంగాలలో పొల్లుమాట ఒక్కటి ఉండదు. ఆయన ఎంత చెబుతారో అంతా చేసి తీరుతారు. అంతేకాదు, ఆయన క్రియలు వాగ్దానాలను దాటిపోతాయి. వక్త అనే పదానికి మామూలుగా చెప్పుకునే అర్థంలో ఆయన వక్త కాదు. కాని ఆయన చెప్పదలుచుకుండేదేదో మూడు ముక్కల్లో సుక్కుకు సూటిగా చెప్పడంవల్ల శ్రోతలపై ఆయన ప్రసంగం మాయని ముద్ర వేసేది. ఆయన ఏం మాటలు ఉపయోగించాడో అని ఎవరూ చూసేవారుకాదు.

పటేల్ను ఉక్కు మనిషిఅని పిలవటం ఎంతైనా తగింది. ఆయన సన్నిధానమై ఆయన అనుయాయులకు ఒక అనిర్వచనీయమైన ఉత్సాహాన్ని ఆత్మ విశ్వాసాన్ని స్థయిర్యాన్ని కల్గించేవి. వీరు పట్టిన పని తప్పక నెరవేరుతుందన్న నమ్మకం ఆయన అనుచరులలో అందరికీ గాఢంగా హత్తుకుపోయి ఉండేది. రాజకీయ సమావేశాల్లోనూ అక్కడా ఆయన పనిచేస్తుంటే దగ్గరవుండి చూస్తూండేవాణ్ణి. ఈ సమావేశాలలో ఎంతో జటిలమైన సమస్యలను పరిష్కరించవలసి వచ్చేది. తన సునిశిత మేధతో ఆయన అవలీలగా ఈసమస్యలను తేల్చివేసేవారు.

తన రాజకీయ గురువు, దేశనాయకుడైన అయిన మహాత్మా గాంధీకి, సర్దార్ పటేలుకూ సామాన్యమైన లక్షణం ఒకటి ఉంది. అది వారి సారస్యం. చమత్కార శక్తి. అయితే జీవితంపట్ల వారి దృక్పథాలలోగల తేడాలను బట్టి, వారి చమత్కార శక్తిలోకూడా కొంత తారతమ్యం ఉంది. తన సన్నిహిత అనుచరులతో సర్దార్ జీ చేసే పరిహాసాలు, ఆయన వాడే ఛలోక్తులు, చాలా "గ్రామ్యమైనవి" గావుండేవనడంలో సందేహంలేదు. ఆయనతో కాలక్షేపం ఎంతో అహ్లాదకరంగా ఉండేది. సామాన్యంగా మనుష్యులకుఉండే దౌర్భల్యాలు, లోపాలు ఎట్టివో ఆయనకు తెలుసు. కాని ఆయన సానుభూతితో సహృదయతతో వారిని అర్థం చేసుకునేవారు. ఎవనికిఎవరిని నియమించాలో అతనికి వారని నియమించి బాధ్యత అంతా వారికి పూర్తిగా వదలిపెట్టేశేవారు. మనుష్యుల్ని ఎన్నుకోడం ఆయనకు చేతనైనట్టుగా మరెవరికీ చేతగాదు.

సర్దార్ తన అనుచరులకు అంత ప్రేమాస్పదుడు కాగలిగాడంటే అందు వీటన్నిటిని మించిన ముఖ్య కారణం ఒకటి ఉంది. చూపులకు ఆయన ఎంత కరుగ్గా కనిపిస్తాడో లోపల అంత మెత్తని హృదయం ఉంది. నా స్వానుభావాన్ని బట్టిఇందుకు అనేక ఉదాహరణలను పేర్కొనగలను. తనను అనుసరించే వేలాదిమందికి ఆయన పితృస్థానీయుడు.

వృద్ధాప్యంలో కూడా ఆయన తన వ్యాధిగ్రస్తులైన అనుచరుల నిరుపేద నివాసాలకు స్వయంగా వెళ్లివస్తూ ఉండేవారు. ఒక్కొక్కప్పుడు ఈ అనుచరుల ఇళ్లకు వెళ్లడానికి మేడమెట్లు కూడా ఎక్కవలసివచ్చేది. ఒంట్లో శక్తి లేకపోయినా, మమకారం చంపుకోలేక ఆయన ఆ శ్రమపడేవారు

బొంబాయి, అహమ్మదాబాదులకు వెళ్లినప్పుడు అక్కడ ఆయన తన పాత స్నేహితులను వెదికిపెట్టుకుని వారితో సరససల్లాపాలాడేవారు. శరీరంలో అనేక రుగ్మతలు ప్రవేశించినా, హాసన్ముఖంతో చివరి వరకు గడిపారు. ఆయనకు సాటియైన వ్యక్తి మరొకడు దొరకడం దుర్ఘటం.

[రేడియో ప్రసంగం]

కలగర రామస్వామి దంపతులు

వీరిద్దరు పుణ్య దంపతులు. ఆదర్శ ప్రాయమగు ప్రాణ మిత్రులు. ప్రజా సేవాపరాయణులు, జాతీయ సేవకులు, యోధులు.

పిచ్చమ్మగారు స్వర్గీయులై కొంత కాలమైనది. రామస్వామిగారు వారం క్రితమే. హృదయ చలన మాగుటచే మరణించిరి. ఇద్దరు వయస్సున, సేవా వృత్తమున వృద్ధులే. రామస్వామిగారి జీవితము ధర్మ బద్ధమైనది. ఎందరో పురుషులు స్త్రీ వుద్యమాభి మానులు కలరు. స్త్రీలకు రక్షణ, పెంపు గల్గించిన వారు కలరు. వారు వీరేశలింగం, ఉన్నవ లక్ష్మీనారా యణ లోకమునకు చెందిన సుగుణులు. వారిలో ఈ రామస్వామి గణనీయులు ఏక పత్నీ వ్రతుడగుట, భార్యను గౌరవించుట, ప్రేమించుట, పెంచుట, గొప్ప బాధ్యతలు. అన్నిట మిన్న యీ రామస్వామి అందులకే వారిపై భారతీదేవికి అంత గౌరవం. నాకు భక్తి.

పిచ్చమ్మగారికి ప్రజా సేవ చేయాలనే కుతూహలం రామస్వామిగారికివలెనే యుండెడిది. ఇద్దరికి స్వరాజ్య సంపాదన యందు పట్టుదలే. ఆ దంపతుల ముద్దుబిడ్డ కీ॥ శే॥ మాగంటి అన్నపూర్ణాదేవి. శ్రీ బాపినీడుగారి భార్య ఆమెయే. ఆమెకు నిండైన అవకాశాలివ్వాలను కొన్నారు. ఆమెకు గొప్ప చదువులు నందించాలను కున్నాడు. అమెరికాకు కూడా పంపసాహసించినారు. కాని ఆమె జాతీయోద్యమ మందు చేరిరి.

అవి 1920 సహాయ నిరాకరణోద్యమ దినాలు. విదేశ వస్త్రములు భస్మం చేయటం, ఆభరణాలను త్యజించడం, సర్వందేశం కొరకై అర్పించ వలెనని దేశారాధకులు ఆరాటబడే దినాలు ఆదారిన నడుస్తా నన్నదా యువతి, అన్నపూర్ణ. ఆనందముతో ఆమో దించిరి. రామస్వామి దంపతులు. ముప్పురు దేశభక్తు లైరి. అప్పటి నుండి జీవితాంతము వరకు అదేధోరణి వారందరిది.

బిడ్డపోయినా. ఆమె ఆశయాల కొరకై కృషి చేయాలను కున్నారు. వారిద్దరు. ఐతే ఒక్కరే ప్రజా హిత జీవితము నడుపుటకు తగిన ఖర్చులు, ఆవేదన, భరించగలరు. ఎవరా అవకాశము పొంద గల్గినది? పొంద దగినది? ఆ ప్రశ్నకు ఎందరో వలెగాక, రామ స్వామి త్యాగియై, తెంపుతో, ప్రేమతో, నూతన యుగమునకు చైతన్యం కల్గిస్తూ, తానే యింటనుండి తనభార్యను ముందు బెట్టుటకు తీర్మానించుకున్నారు.

ఆ బాట క్రొత్తది. గొప్పది. దేశానికి అవసరమై నది. తాము బీదలే! కల్గిన వారింటికి అన్నపూర్ణను పంపిన, తాము మాత్రము మొదటలో మెషినుకుట్టి జీవనోపాధి సంపాదించుకొనిరి. పిమ్మట రామస్వామి గారే ఎన్నెన్నో ప్రయత్నాలు, ఆత్మగౌరవప్రదంగా జీవనోపాధి పొందుటకై స్వంత ఉద్యోగాలు సాగిం చారు. చిన్న సోడాషాపు. ఒక హోటలు, మరోషాపు యిలాగా కొంగ్రొత్తదారులు తనలాంటి దేశ భక్తు లకు చూపిరి. తమ అనుభవంద్వారా.

అన్నపూర్ణ యిచ్చిపోయిన చిరంజీవి ఝాన్సీని పెంచి. పెద్దజేసి, పెండ్లి చేసిరి. ఆ సుగుణ రామ స్వామిగారిని వృద్ధాప్యములో ఆదరించి. పుణ్యాము గట్టుకొనిరి.

ఎంతకాలం, ఎంతపట్టుదలతో, సుహృదయులై నిరాశనొందక దేశారాధన చేసిరి. ఆ రామస్వామి ఎన్నేళ్ళు తన ప్రియతను పిచ్చమ్మగారికి ఉత్సాహం ఉల్లాసం, ఖర్చులు, అభిమానం అందించిరి.

ఆదంపతులిద్దరి కివే రైతాంగపు జోహారులు.

— రంగాజీ

మహిళా సమాజాలు

గుడివాడ

గుడివాడ పట్టణ మహిళా సంఘ కార్యాలయమైన కస్తూర్బా వర్ధనములో గాంధీ జయంతి, పట్టణ మహిళలచే జయప్రదముగా జరుపబడినది.

సాయంత్రము 4½ గం॥లకు॥ కార్యవర్గ సభ్యురాండ్రచే సూత్ర యజ్ఞము జరుపబడినది. "రఘుపతిరాఘవ రాజారాం" భజనతో కార్యక్రమము ప్రారంభమైనది. మిద్ది రంగనాయకమ్మగారు, అయ్యంకి. సీతారామమ్మగారు. గీతా పఠనము చేసిరి. కోగంటి. శకుంతలమ్మగారు- గాంధీ జీవితంను గురించి వుపన్యసించినారు.

మహిళా సంఘ అధ్యక్షురాలు, ఈడ్పుగంటి బాపమ్మగారు, మిస్ యస్. త్యాగరాజు, అడ్సుమిల్లి. రాజేశ్వరిగారు, అడ్సుజల్లి. జయప్రదగారు, ఆగ్నేసుగారు. పిల్లలకు పాలు, పండ్లు పంచిపెట్టారు. ఆగ్నేసుగారు. తమ తరుఫున పాలు సప్లై చేశారు.

గుంటూరు

ది 2-10-58 వ తేదీన భారత సేవక సమాజము- మహిళా శాఖ గుంటూరు వారిచే నిర్వహింప బడుచున్న వికలాంగుల శరణాలయములో గాంధీ జయంత్యోత్సవము జరుప బడినది. ఆ పవిత్ర దినమున శరణాలయ బాల బాలికలూ వార్డెనుగారైన కె. ఈశ్వరమ్మగారూ కలసి ఉత్సాహంతో గాంధీజీ స్మరణ చిహ్నంగా 2 గంటల సేపు మౌనంతో రాట్నాలపై దారం తీశారు. సాయంత్రం 4 గంటలకు శరణాలయ బిడ్డలు వినోదంగా మహాత్ముని స్తోత్రములు, జాతీయ గీతము గానం చేశారు.

తరువాత సమాజ సెక్రటరీగారైన శ్రీమతి జాగర్లమూడి గంగాచంద్రమౌళిగారు గాంధీజీ జీవిత విశేషాలను, మహాత్ముని ప్రబోధాలను, సత్యాహింసాసూత్రాలను గురించి శరణాలయ బిడ్డలకు విశదం చేశారు. ఆ మహనీయుని మతానుసారంగా నేటి బాల బాలికలు పాటించవలసిన విధులను చక్కగా వివరించారు.

తరువాత గాంధీజీ చిత్ర పటమునకు శ్రీమతి జాగర్లమూడి గంగాచంద్రమౌళిగారు పూల మాలను సమర్పించారు, శరణాలయ, విద్యార్థులు భక్తిశ్రద్ధలతో ప్రార్థన చేశారు.

విశాఖపట్నం

5-10-58 సాయంత్రం ప్రేమసమాజ కుష్ఠురోగుల శరణాలయంలోని చికిత్సాలయానికి హిందూ మత ధర్మాదాయాల కమీషనర్ శ్రీ పి. లక్ష్మయ్యగారు శంకుస్థాపన గావించారు. ఈ సందర్భములో శ్రీ సింహాచలం దేవస్థానం ధర్మకర్తలైన విజయనగరం రాజావారి చిత్ర పటం శ్రీ పి. యల్. యస్. రాజుగారిచే ఆవిష్కరించ బడింది. ప్రేమసమాజ కుష్ఠురోగుల శరణాలయం కీ॥శే॥ రాణీ సాహేబా ఆఫ్ చెముడు వారు దానం చేసిన వసతిలో నిర్వహించ బడుతుంది. ఇది 20,000/॥రూ॥ లకు పైగా విలువ చేస్తుంది. పాతబడిపోయిన యిండలి గదులు పౌరులిచ్చిన సుమారు రూ 10, 000/॥ల॥ విరాళంతో బాగుచేయ బడినవి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ యిచ్చిన రూ॥ 10. 000/-లతో పరికరాలు సమకూర్చ బడినవి. ఈ శరణాలయంలోని 50 మంది రోగుల పోషణార్థం సింహాచలం దేవస్థానం నుండి యేటా 12, 000 రూ/॥లు॥ విరాళమివ్వ బడుతుంది.

సర్ దొరాబ్జి టాటాట్రస్ట్, బూల్ చంద్ అండ్ సన్స్ యిచ్చిన ధనంతో చికిత్సాలయం నిర్మించ బడనున్నది. శ్రీ లక్ష్మయ్యగారికి ప్రేమసమాజ అధ్యక్షులు శ్రీ కె. యస్. దత్ గారు సన్మాన పత్రం సమర్పించగా శ్రీ లక్ష్మయ్యగారు ఉచిత రీతిని సమాధానమిస్తూ సమాజం చేస్తున్న ఉత్తమ సేవలను కొనియాడారు. సాహిత్య విద్యా ప్రవీణ, ఉభయ భాషాప్రవీణ శ్రీ రాయబట్ల లక్ష్మీనారాయణశాస్త్రిగారు సమాజ, సేవలు ఆశయాలపై వుపన్యసించారు. శ్రీ స్వామి చైతన్యానంద సరస్వతి వారి వందన సమర్పణతో సభ ముగిసింది. పిమ్మట సమాజ బాల బాలికలచే "సక్కుబాయి" బుర్రకథ చెప్పబడింది. కార్యక్రమానికి వందలాది జనం హాజరైనారు.

సంగం జాగర్లమూడి

సంఘం జాగర్లమూడి మహిళా సమాజమువారి ఆధ్వర్యమున ఈ నెల 14వ తేదీ ప్రధాని నెహ్రూ జన్మదిన బాలల దినోత్సవము జరుపబడెను. ఈ వుత్సవములో స్థానిక కమిటీ, హిందూ, బోర్డు, లూథరన్ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాల బాల బాలికలు, ఉపాధ్యాయ వర్గము పాల్గొనిరి. వివిధములగు ఆటల పోటీలు జరుపబడెను. బోర్డు స్కూళ్ళ బాల బాలికలు చిన్న డ్రామాలు, విచిత్ర వేష ధారణలు నిర్వహించిరి. ఈ సభకు శ్రీ వీరమాసనేని సంఘమేశ్వరరావుగారు అధ్యక్షత వహించిరి. ఈ సభకు విచ్చేసిన న్యాయవాదులు శ్రీ పి. వి. సుబ్బారావు బి.ఎ. బి. ఎల్. గారు బాలల దినోత్సవ ప్రాముఖ్యతను, భావి పౌరులను తయారుచేయు మహిళల కర్తవ్యమును, మహిళా సమాజములో చేయవలసిన కృషిని గురించి మాట్లాడిరి. ఉత్సవమున బాలబాలికలు స్త్రీ పురుషులు షుమారు 400 మందికి పైన పాల్గొని సభను జయప్రదము గావించిరి. కార్యదర్శిని శ్రీమతి కొత్త గంగమాంబగారి వందన సమర్పణతో సభ సమాప్తమైనది.

స్త్రీల ఉచిత విద్యకు నర్సాపురములో ఏర్పాటు

న్యూఢిల్లీలోని సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డువారు ఈ మధ్య ఒక కేంద్రమును నర్సాపురం (పశ్చిమ గోదావరి జిల్లా) హిందూ స్త్రీ పునర్వివాహ సహాయక సంఘము వారికి గ్రాంటు చేసినట్లు తెలియుచున్నది. ఈ కేంద్రము నందు 25 గురు చేర్చుకొనబడి, ఉచిత వసతి, విద్య, భోజనము, బట్టలు, పుస్తకములు ఒసంగబడి పైన 5 రూపాయలు ఒక్కొక్కరికి పాదరుకై ఈయ బడును. కేంద్రము నందు చేర్చుకొన బడు వారి వయస్సు 20 సం॥రములకు తక్కువ కాకుండు నట్లును, 35 కు మించకుండను ఉండవలెనట.

దరఖాస్తులను ఫౌండర్– సెక్రటరీ శ్రీ ఎ. యస్. చెట్టి బి. యె గారికి ఈ నెలాఖరులోన అందునట్లు పంపవలెననియు దరఖాస్తు దారుల విద్యార్హతల ననుసరించియె మిడిల్ స్కూల్ పరీక్షకు గాని, ఆంధ్రా మెట్రిక్ పరీక్షగాని ఎంచుమించు రెండు సం॥రములలో తయారు చేతురనియు విను చున్నాము. డిశెంబరులో ఈయునిట్ ప్రారంభించబడును.

పరీక్షలలో తరిఫీదు పొందిన వారు ప్రభుత్వము వారిచే నిర్ణయించబడిన ట్రైనింగు, టీచరు, నర్సు మంత్రసాని, దాయి, మొదలైనవి పొందిన తరువాత 3 సం॥రముల పాటు ప్రభుత్వము వారిచే నెలకొల్పబడిన సెంటర్లలో (గ్రామములలో) పని చేయుటకు బాండ్ ఇయ్యవలసి యుండును.

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the month of October '58.

OUT-PATIENT REGISTER	October
No. of Surgical cases treated	27
,, ,, Medical ,, ,,	1,344
,, ,, Ante-natal ,, ,,	244
,, ,, Post-natal ,, ,,	86
,, ,, E.E.N.T. ,, ,,	79
,, ,, Gyneac ,, ,,	136
,, ,, Dental ,, ,,	23
Total No. of New patients	1,939
,, ,, ,, Old patients	2,496
Grand total	4,435

ADMISSION REGISTER	
No. of Patients admitted for deliveries	247
,, ,, Medical cases treated	93
,, ,, Post-Natal ,, ,,	5
,, ,, Gyneac ,, ,,	29
,, ,, Babies admitted as Lodgers	187
Grand total	561

IN-PATIENT MATERNITY REGISTER	
No. of Normal deliveries	185
,, ,, Abnormal deliveries (Forceps)	4
Grand Total	189

'SHMI PARVATHI
and Convenor

Dr. M. PAVANA BAI
Medical Superintendant

ఆంధ్ర మహిళ 15వ వార్షిక సంచిక

ప్రకటనల వివరాలు

(ఒక రంగు ; ఒక ముద్రణకు)

నాల్గవ కవరు	...	..	60 రూ.
లోపలి పేజీ	..	...	50 ,,
అర పేజీ	...	...	30 ,,
పావు పేజీ	...	...	20 ,,

కాంట్రాక్టు ప్రకటనలకు ప్రత్యేక ధరలు.

మ హి ళ ప్ర క ట న

అంటే

విస్తృతమైన పబ్లిసిటీ * మంచిపనికి మేలు

సంవత్సర చందా : 6 రూపాయలు

7 ఎ రోజరీ చర్చి రోడ్డు మద్రాసు 4.

Edited, Printed & Published by Mrs. K. Lakshmi Raghuram, B.A., at the Andhra Mahila Press, Mylapore, Madras 4.